తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

09-09-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 212

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్ల తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575

# టీజీ ట్రాన్స్‌కోలో



# సిరి ప్రకంపనలు!

## ఆ ఫైళ్లు బయటకొస్తే అంతేనా?

ట్రాన్స్‌కోలో తెరవెనుక మాస్టర్‌మైండ్ల బాగోతంపై 'సిరి న్యూస్' పరిశోధనాత్మక కథనం

అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

చిన్న బాస్ ఆదేశాలతో నడిచిన అక్రమ ఫీజిబిలిటీల వ్యవహారం

విద్యుత్ సౌధలో పెను దుమారం

రహస్య ఫైళ్లు, కాగితాలు బయటకు పొక్కకుండా ఉన్నతాధికారుల హెచ్చరికలు

ఒక్క పేపర్ లీకైనా వేటు తప్పదంటూ హుకుం..

తప్పుడు నిర్ణయాల రికార్డులకు అత్యవసరంగా తాళాలు

సంతకాల గుట్టు ఎలా రట్టయిందని ఆరా?

నిర్బంధపు ఆదేశాల వెనుక అసలు కుట్ర బయటపడటంతో అధికారుల ఉక్కిరిబిక్కిరి

అక్రమాలపై సమగ్ర విజిలెన్స్ విచారణకు డిమాండ్













**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

టీజీ ట్రాన్స్‌కోలో రాజకీయ శక్తుల కనుసన్నల్లో మాజీ అధికారులు సాగిస్తున్న అడ్డగోలు దందాను బట్టబయలు చేస్తూ 'సిరి న్యూస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనం సంస్థలో పెను భూకంపం సృష్టించింది. 'చిన్న బాస్' అండదండలతో ఇద్దరు మాజీ అధికారులు ట్రాన్స్‌కో సాంకేతిక నిబంధనలను ఎలా తుంగలో తొక్కుతున్నారో పక్కా ఆధారాలతో వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆత్మరక్షణలో పడ్డారు. గత రెండేళ్ల కాలంలో ఇచ్చిన అనుమతులు, అడ్డగోలు ఫీజిబిలిటీలపై ప్రజల్లో ప్రశ్నలు వెల్లువెత్తుతుండటంతో సమాధానాలు చెప్పుకోలేక చేష్టలుడిగి చూస్తున్నారు. గత నెలలో ఉద్యోగుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ తీసుకొచ్చిన వివాదాస్పద నిర్బంధపు ఉత్తర్వుల వెనుక అసలు మర్మం ఏమిటో రట్టవడంతో, అక్రమాలకు పాల్పడిన ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

మిగతా 2వ పేజీలో..



# సర్కారుతో తాడో పేడో!

- ఉద్యమానికి సిద్ధమైన ఉద్యోగ లోకం
- మేనిఫెస్టో హామీల అమలుపై సర్కారుతో జంగ్
- రేపు ఎల్బీ స్టేడియంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ
- కొత్త పీఆర్సీ అమలు, 6 డీఏల బకాయిలపై పోరుబాట
- రిటైర్మెంట్ ప్రయోజనాలు, పెన్షన్ బకాయిల

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడంతో ఉద్యోగ లోకం రగిలిపోతోంది. మేనిఫెస్టో హామీల అమలు కోసం ఇక ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవాలని ఉద్యోగ సంఘాల జేఏసీలు నిర్ణయించాయి.

మిగతా 2వ పేజీలో..

# సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్ డిమాండ్
- సభలో చర్చను దారిమళ్లించేందుకే కాంగ్రెస్ చిల్లర డ్రామాలు



2

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

- తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



3

## రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప చావు కోరుకోవడమేంటి?

- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

3

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

- ఆ నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు 10న ఆఖరు
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం

3





## టీజీఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన అకౌంట్స్ ఉద్యోగులు

- పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రత్యేక ధన్యవాదాలు
- పుష్పగుచ్ఛం అందించి ఘన సన్మానం

2

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

టీజీఎస్పీడీసీఎల్‌లో అకౌంట్స్ విభాగ అధికారుల దీర్ఘకాలిక పదోన్నతుల సమస్యను పరిష్కరించి, పదోన్నతులకు ఆమోదం తెలిపి అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం అకౌంట్స్ విభాగ ఉద్యోగ సంఘ నాయకులు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జితేష్ పాటిల్‌ను కలిశారు.

## కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి

- గౌరవ సభ కాదు.. కౌరవ సభ.. రాష్ట్రంలో పాలన గాడితప్పింది..
- లా అండ్ ఆర్డర్ మంటగలిసింది.. కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకోవాలి
- తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలి.. కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య
- రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి
- జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు

3




## తిట్టింది నా తల్లిని.. నీకెందుకు ఆగ్రహం?



- హరీశ్‌రావుపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం
- సీనియర్ సభ్యుడిగా మాట్లాడిన తీరు బాగాలేదని వ్యాఖ్య
- తన తల్లిని తిట్టినందుకు ఆగ్రహం ఉందన్న గడ్డం ప్రసాద్‌కుమార్
- 'నీ తల్లిని తిట్టనప్పుడు నీకెందుకు ఆగ్రహం?' అంటూ నిలదీత
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై నివేదిక కోరిన స్పీకర్

3





## ఎర్రవల్లిలో హైటెన్షన్

- కాంగ్రెస్-బీఆర్ఎస్ శ్రేణుల బాహాబాహీ
- దామరకుంట వద్ద రాళ్ల దాడి, తోపులాట
- కేటీఆర్, హరీశ్ రావు ఎర్రవల్లి బాట
- మార్గమధ్యలో పోలీసుల అరెస్ట్, భారీ బందోబస్తు

3

# టీజీ ట్రాన్స్‌కోలో సిరి ప్రకంపనలు!

**తప్పుడు ఫైళ్లకు అత్యవసర తాళం..**

'సిరి న్యూస్' కథనం వెలువడిన వెంటనే విద్యుత్ సౌధలోని కీలక విభాగాల్లో భయాందోళనలు మొదలయ్యాయి. గత రెండేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా క్లియర్ చేసిన వివాదాస్పద ఫైళ్లు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో అధికారులు వాటికి అత్యవసరంగా తాళాలు వేసే పనిలో పడ్డారు. సంస్థలో జరిగిన పనులకు సంబంధించి ఒక్క ఆధారం గానీ, ఒక్క నోట్ ఫైల్ పేపర్ గానీ బయటకు వెళ్లినా సంబంధిత సెక్షన్ అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవంటూ ఓ ఉన్నతాధికారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తప్పులను సరిదిద్దుకునే బదులు, దొడ్డిదారిన తీసుకున్న నిర్ణయాలను ఎలా కప్పిపుచ్చాలనే వ్యూహాల్లోనే పాలకవర్గం తలమునకలవుతోంది.

**ఉలిక్కిపడ్డ అధికారులు..**

ఫీజిబిలిటీల జారీ ప్రక్రియలో అధికారులంతా ఒకేచోట కూర్చుని సామూహికంగా సంతకాలు పెట్టిన బాగోతం బయటపడటం అంతర్గత వర్గాల్లో తీవ్ర దుమారాన్ని రేపుతోంది. సంక్లిష్టమైన సాంకేతిక ప్రక్రియను గాలికొదిలేసి, ఒకే రోజులో ఆగమేఘాల మీద క్లియరెన్స్‌లు ఎలా ఇచ్చారన్న వాస్తవం మీడియాకు ఎలా చేరిందనే దానిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. సంస్థ అంతర్గత విషయాలు బయటకు వెళ్లకూడదని ఉత్తర్వులు ఇచ్చినా పత్రికలకు సమాచారం ఎలా లీక్ అవుతోంది? అంటూ తోటి సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు బహిర్గతమైతే న్యాయపరమైన చిక్కులు తప్పవన్న ఉద్దేశంతోనే ఆయా ఫైళ్లను అత్యంత రహస్య విభాగంలో భద్రపరిచేందుకు యత్నిస్తున్నారు.

**ఫీజిబిలిటీ ఎలా సాధ్యం?**

క్షేత్రస్థాయి వాస్తవాలు పరిశీలిస్తే ట్రాన్స్‌కో అధికారుల అంకెల గారడీ మరింత విస్మయం కలిగిస్తోంది. గత రెండేళ్ల కాలంలో తెలంగాణలో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో కొత్తగా 132 కేవీ, 220 కేవీ, 400 కేవీ స్థాయిలో కొత్త ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చిన దాఖలాలే లేవు. గత వేసవిలోనే గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోలేక ప్రస్తుత సబ్‌స్టేషన్లు తీవ్రమైన ఒత్తిడికి గురై మొరాయించాయి. డిస్కమ్ అధికారులు సైతం గ్రిడ్ నిర్వహణపై చేతులెత్తేసిన పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలకు కనీస మరమ్మతులు చేయకుండా, లైన్ల మోసే సామర్థ్యాన్ని పెంచకుండా.. కేవలం కాగితాలపై అదనపు లోడు ఉన్నట్లు చూపిస్తూ కాసుల కోసం ఫీజిబిలిటీలు ఎలా ఇస్తున్నారని విద్యుత్ నిపుణులు నిలదీస్తున్నారు.

**3,600 మెగావాట్లలో డొల్లతనం**

హైదరాబాద్ శివారులో విస్తరిస్తున్న డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్ ప్రసారానికి సం బంధించి ఇటీవల ఇచ్చిన ప్రాథమిక ఫీజిబిలిటీలలో భారీ లొసుగులు బయటపడ్డాయి. దీనిపై మీడియా గానీ,
ఇతరులు గానీ ప్రశ్నిస్తే "మాకేం తెలియదు" అని దాటవేయాలని సెక్షన్ అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా రెండు బడా కంపెనీలకు ఏకంగా 3,600 మెగావాట్ల విద్యుత్ ప్రసారం కోసం ఆదరాబాదరాగా ప్రాథమిక అనుమతులు మంజూరు చేశారు. ఏడాదికి 200 మెగావాట్ల చొప్పున ఇస్తామని చెప్పినప్పటికీ, ఫీల్డ్ లెవల్‌లో కనీసం ఆ 200 మెగావాట్లను కూడా ఇచ్చే లైన్ సామర్థ్యం లేదన్నది నగ్న సత్యం. పైగా విద్యుత్ లైన్ల విస్తరణకు అయ్యే భారీ ఖర్చును సదరు ప్రైవేట్ సంస్థలే భరించాలన్న ప్రాథమిక నిబంధనను కూడా ఉత్తర్వుల్లో చేర్చకపోవడం తెరవెనుక జరిగిన భారీ లావాదేవీలకు నిదర్శనంగా నిలుస్తోంది.

**పీక్ లోడ్‌ను విస్మరించి నిర్ణయాలు..**

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సోలార్, విండ్, కోల్, హైడల్ విద్యుత్ ఉత్పత్తి లెక్కల్లో పీక్ అవర్స్ తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా, సాధారణ పరిస్థితులను మాత్రమే ఆధారంగా చేసుకుని తప్పుడు నివేదికలు తయారు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
కేవలం పైరవీకారుల ప్రయోజనాల కోసం ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ప్రమాదంలోకి నెట్టేలా తప్పుడు ఫీజిబిలిటీలు ఇవ్వడంపై విద్యుత్ ఇంజనీర్ల వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, 'సిరి న్యూస్' వెలుగులోకి తెచ్చిన ఫీజిబిలిటీ అనుమతులపై స్వతంత్ర విజిలెన్స్ లేదా న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులైన మాజీల ముఠాతో పాటు వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**చిన్నబాస్, ఆ ఇద్దరు మాస్టర్‌మైండ్లు ఎవరనే దానిపై పెను దుమారం**

టీజీ ట్రాన్స్‌కోలో తెరవెనుక చక్రం తిప్పుతున్న ఆ 'చిన్నబాస్' ఎవరు? ఆయన అండతో సంస్థ సాంకేతిక, పరిపాలనా నిబంధనలను అటకెక్కించి దందాలు నడిపిస్తున్న ఆ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఎస్ఈల ద్వయం ఎవరు? అనే అంశాలపై ప్రస్తుతం విద్యుత్ సౌధలో తీవ్రస్థాయిలో గుసగుసలు, జోరుగా చర్చలు సాగుతున్నాయి. 'సిరి న్యూస్' వరుస పరిశోధనాత్మక కథనాలతో అడ్డగోలు ఫీజిబిలిటీల బాగోతం బట్టబయలు కావడంతో ఉన్నతాధికారుల్లో తీవ్ర గుబులు మొదలైంది. ఒకే వేదికపై కూర్చుని ఫైళ్లపై మూకుమ్మడిగా సంతకాలు పెట్టిన గుట్టు, కాగితాలపై అదనపు లోడు చూపిస్తూ ఇచ్చిన రహస్య అనుమతుల వివరాలు మీడియాకు ఎలా చేరాయన్న దానిపై యాజమాన్యం తలపట్టుకుంటోంది. బయటి వ్యక్తులతో ఎవరూ మాట్లాడొద్దంటూ నిర్బంధపు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, సంస్థ అంతర్గత వ్యవహారాలు, గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న రహస్య ఫైళ్ల లొసుగులు బయటకు ఎలా పొక్కుతున్నాయన్న దానిపై ఉన్నతాధికారులు అంతర్గతంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సిబ్బందిపై అనుమానాల నిఘా పెంచినట్లు తెలుస్తోంది.







# టీజీఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన అకౌంట్స్ ఉద్యోగులు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. అంజయ్య సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అకౌంట్స్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యతో పాటు ఇతర ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపి, అత్యంత సానుకూలంగా స్పందించిన సీఎండీకి అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పి. అంజయ్య మాట్లాడుతూ.. పదోన్నతుల ఉత్తర్వులు వెలువడడంతో టీజీఎస్పీడీసీఎల్ అకౌంట్స్ విభాగంలోని అధికారులు, ఉద్యోగుల్లో సర్వత్రా ఆనందోత్సాహాలు నెలకొన్నాయని తెలిపారు. ఈ పదోన్నతులు అధికారుల ఆత్మవిశ్వాసాన్ని మరింత ఇనుమడింపజేయడంతో పాటు, సంస్థ అభివృద్ధికి మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేయడానికి గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. అకౌంట్స్ విభాగంలోని అధికారులు, ఉద్యోగుల ఇతర సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో కూడా యాజమాన్యం ఇదే విధమైన సానుకూల దృక్పథంతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. అంజయ్య, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ పి. అనిల్, తేజస్విని తదితర అకౌంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రావణమాస బోనాలు..



- తొటెల కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**
భారతీనగర్ డివిజన్ ఫెన్సింగ్ ఏరియాలో శ్రావణమాస బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ యువ నాయకుడు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొటెల కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి.. స్థానిక ప్రజలు, నిర్వాహకులకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, జైపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారుతో తాడో పేడో!

- చెల్లింపులకు డిమాండ్
- హామీలిచ్చి ఇప్పుడు ఆర్థిక భారమంటే ఒప్పుకోమన్న సంఘాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి చర్చలు విఫలం
- ఉద్యోగుల తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వం దిగిరాకుంటే పాలన స్తంభింపజేస్తామని హెచ్చరిక




రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 9 లక్షల మందికి పైగా ఉద్యోగుల పక్షాన గళమెత్తేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. గతంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులు నిర్వహించిన మహాధర్నా ప్రభుత్వానికి హెచ్చరిక కాగా, ఇప్పుడు యావత్ ఉద్యోగ యంత్రాంగం కదం తొక్కేందుకు సిద్ధమైంది.

**చర్చల పేరిట కాలయాపన..**

సమస్యల పరిష్కారం కోసం ఇటీవల ఉద్యోగ సంఘాల నేతలతో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జరిపిన చర్చలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సమస్యలను సానుకూలంగా పరిష్కరించే కార్యాచరణ ప్రకటించాల్సింది పోయి, ఖజానా ఖాళీగా ఉందని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేనందున ప్రస్తుతానికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించలేమని చేతులెత్తేయడం ఉద్యోగుల ఆగ్రహానికి ఆజ్యం పోసింది. ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడం కోసం లేనిపోని హామీలు గుప్పించి, తీరా గద్దెనెక్కాక ఆర్థిక భారం అంటూ తప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని సంఘాల నేతలు నిలదీస్తున్నారు. కేవలం సమావేశాల పేరుతో తాత్సారం చేస్తూ ఉద్యోగులను అవమానించే ధోరణిని సహించేది లేదని జేఏసీ నేతలు తెగేసి చెప్పారు.

**డిప్యూటీ సీఎం భార్యకు 10 శాతమా?..**

ఇటీవల ఇందిరా పార్క్ వేదికగా జరిగిన ఉపాధ్యాయుల మహాధర్నాలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఉద్యోగ వర్గాల్లో ఇంకా ప్రకంపనలు సృష్టిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు, ఫైళ్లు క్లియర్ కావాలంటే ఆర్థిక మంత్రి భార్యకు 10 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని బహిరంగంగా ఆరోపించినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడాన్ని ఉద్యోగులు తప్పుపడుతున్నారు. మంత్రుల కుటుంబాల కమిషన్లకు నిధులుంటాయి కానీ, రక్తం ధారపోసి పనిచేసే ఉద్యోగుల హక్కులకు నిధులు లేవా? అంటూ ఉద్యోగులు నిలదీస్తున్నారు. అవినీతిపై ఎలాంటి విచారణ జరపకుండా, ఉద్యోగుల న్యాయమైన హక్కులను కాలరాయడంపై ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

**పీఆర్సీ అతీగతీ లేదు.. పెండింగ్‌లో 6 డీఏలు**

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన కొత్త వేతన సవరణ అమలుపై ప్రభుత్వం నేటికీ స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసరాల ధరలతో ప్రస్తుత జీతాలతో సాధారణ ఉద్యోగి కుటుంబాలను నెట్టుకురావడం కష్టతరంగా మారింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు డీఏలు మంజూరవుతుంటే, తెలంగాణలో ఏకంగా ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టి సర్కార్ ఉద్యోగుల కడుపు కొడుతోందని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. డీఏ అనేది వితరణ కాదని, ఉద్యోగి వేతనంలో రాజ్యాంగబద్ధమైన భాగమని గుర్తుచేస్తున్నారు. ఈ డీఏ బకాయిలను వెంటనే ఒకే విడతలో లేదా పక్కా ప్రణాళికతో చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగులు పట్టుబడుతున్నారు.

**రిటైరైనా తప్పని కన్నీళ్లు..**

దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో తరించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ బకాయిలు సకాలంలో అందక విశ్రాంత ఉద్యోగులు ఆస్పత్రుల బిల్లులు కట్టలేక తీవ్ర ఆర్థిక ఒత్తిడితో అల్లాడిపోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో అత్యంత ప్రాధాన్యతనిచ్చిన సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించింది. ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను ఎలా అమలు చేశారో, తెలంగాణలోనూ అలాగే పునరుద్ధరించాలని ఉద్యోగులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**పక్కా రోడ్‌మ్యాప్ కావాలి.. సంఘాల హెచ్చరిక**

కేవలం హామీలు, కమిటీలతో మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకుని.. పీఆర్సీ అమలు ఎప్పుడు? 6 డీఏల బకాయిల విడుదల ఎప్పుడు? రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు ఎప్పుడు? అన్న నాలుగు కీలక ప్రశ్నలకు ప్రభుత్వం లిఖితపూర్వక రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఎల్బీ స్టేడియం సభ ద్వారా సర్కార్‌కు చివరి అవకాశం ఇస్తున్నామని, ప్రభుత్వం దిగిరాకపోతే కలెక్టరేట్లు, సచివాలయాన్ని ముట్టడించడంతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమానికి దిగుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. పాలనా యంత్రాంగం స్తంభిస్తే తలెత్తే పరిణామాలకు రేవంత్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో, నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభ రోజే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశాల మేరకే వారిని అడ్డుకుంటున్నామని పోలీసులు చెప్పడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**తాతా మధుపై కేసు**

ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. స్పీకర్‌ను కులం పేరుతో దూషించడంతోపాటు అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మరో ఎమ్మెల్సీ అరెస్ట్**

తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కఠిన చర్యలకు డిమాండ్**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మరుసటి రోజే ఇద్దరు ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తమ ఎమ్మెల్సీల అరెస్టుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

శాసనసభలో తమ పార్టీ మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర డ్రామాలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పరిపాలనా వైఫల్యాలు, '420' హామీలు సహా అన్ని ప్రజా సమస్యలపై శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, ప్రతీ అంశంపైనా స్పష్టమైన సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు సభలో చర్చకు రాకుండా తప్పించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చిల్లర వేషాలు వేస్తోందని, ఈ పరిణామాలన్నింటినీ ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడేవారు బీఆర్ఎస్‌లో ఎవరూ లేరని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరుగుతున్న దాడి, అరెస్టుల అంశంపై శాసనమండలిలో ఖచ్చితంగా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకురాళ్లపై జరిగిన దాడికి, బనాయించిన కేసులకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని తేల్చిచెప్పారు.

# 104 గ్రాముల గంజాయి స్వాధీనం ఇద్దరు యువకులు అరెస్ట్ - సీఐ రాజశేఖర్

- ఆత్మకూరు (ఎస్)లో గంజాయి కట్టడి...ఇద్దరు యువకులు అరెస్ట్!
- 104 గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం... నిందితులకు రిమాండ్.
- మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు.
- గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు: పోలీసుల హెచ్చరిక.

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 సిరి న్యూస్:**



ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సూర్యాపేట సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22) గంజాయితో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఆత్మకూరు (ఎస్) పోలీసులు తనిఖీలు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ...యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, ఉద్యోగం, క్రీడల్లో రాణించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని, చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై ఐలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలపై సోమవారం దాడి జరిగితే ఎందుకు చర్చ చేయడం లేదు... ఎందుకు మహిళా ఎమ్మెల్యేలకు మైకులు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. ఆనాడు ద్రౌపది పట్ల వ్యవహరించిన తీరు గుర్తు చేస్తున్నదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పుకోవడానికి అసెంబ్లీలో వారికి అవకాశంగా ఇవ్వడం లేదంటూ గౌరవ సభను రేవంత్‌రెడ్డి కౌరవ సభగా చేశాని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరగలేదని స్పీకర్ ఎలా అంటారు అంటూ యావత్ దేశం చూసింది.. మీడియాలో వచ్చింది అన్నారు. ఫిర్యాదు ఇస్తే నమోదు కాలేదు.. దాడి జరిగిన సునీతమ్మ, సబితమ్మ, కోవా లక్ష్మిపై ఉల్టా కేసు పెట్టారు అని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడం అంటే ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటె అన్నట్లేనన్నారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నడన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగి, గొంతు నులిమి అరెస్టులు చేసి రేవంత్ వికృతానందం పొందుతున్నడన్నారు. స్పీకర్ మీద కావాలని అనలేదంటూ అయినా అందుకు మధు క్షమాపణలు చెప్పారన్నారు. బీజేపీ వాళ్లు ప్లకార్డులు తీసుకు వెళ్తే అడ్డుకోరు.. తాము టీ షర్టులు వేసుకుంటే అడ్డుకుంటరు.. బీజేపీ, కాంగ్రెస్ బంధం ఇదే కదా అని నిలదీశారు. బడివే అని, తంతం అని అసెంబ్లీల్లో అంటే అది వికృత భాష కాదా ప్రశ్నించారు. తాము ఆరు గ్యారెంటీల గురించి అడిగితే వికృత భాషనట.. మొన్న పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు నులిమారు.. నిన్న సబితమ్మ గొంతు పట్టుకున్నారు.. నేడు తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఇంటిపైకి దాడికి ఉసిగొల్పారు అని ఆరోపించారు. రోప్ పార్టీ ఇచ్చి, ఎస్కార్ట్ ఇచ్చి దగ్గరుండి దాడికి ప్రోత్సహించారన్నారు. హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి.. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగినదానికి క్షమాపణ చెప్పాలి.. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపై దాడి జరిగిందానికి క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో లేదు.. అన్ని వర్గాలపై దాడులు జరుగుతున్నాయి అని మండిపడ్డారు. నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కేంద్రం జోక్యం చేసుకోవాలని, రాష్ట్రపతి పాలన పెట్టాలి అని గవర్నర్‌ను కోరుతున్నామని హరీష్‌రావు చెప్పారు. రాహుల్ గాంధీ.. మీరు ఎందుకు మాట్లాడటం లేదు.. లా అండ్ ఆర్డర్ చేతుల్లోకి తీసుకుని గూండాల్లాగా ప్రవర్తిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని చేతులో పట్టుకుని ఉండే నువ్వు ఇక్కడ జరుగుతున్న రాజ్యాంగ భక్షణ కనిపించడం లేదా అని నిలదీశారు. కేటీఆర్, యాదవ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సంజయ్, నాకు అందరికీ దెబ్బలు తాకాయి.. తాము పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తీసుకోవడం లేదు.. చేతులో అధికారం ఉందని, మందబలం ఉందని ఇష్టం ఉన్నట్లు వ్యవహరిస్తే కౌరవులకు పట్టిన పరిస్థితే మీకు ఉంటుంది అని హరీష్‌రావు హెచ్చరించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్ చావాలని అనడం దారుణమన్నారు. వెంటనే ఆయనపై తీర్మానం పెట్టి ఆయన సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సభలో ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థానం ప్రతిపక్ష నాయకుడిది. అలాంటి నాయకుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోరు అని స్పీకర్‌ను అడిగారు. ఇదేం ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. 119మంది ఎమ్మెల్యేలను సమానంగా చూడాలి కానీ ఎందుకు ఏపక్షంగా వ్యవహరిస్తున్నారని అడిగారు. రెండు రోజులు ప్రజల సమస్యలపై చర్చ లేకుండా సభా సమయాన్ని వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మిమ్మల్ని వదిలిపెట్టదని, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉంటాం.. మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాం అని ఆయన హెచ్చరించారు. సభలో చర్చ జరిగితే వైఫల్యాలు బయట పడుతాయని చర్చ జరగకుండా ప్లాన్ చేసిండు అన్నారు. ఈ చేతగాని దద్దమ్మ సీఎం వల్ల ఇక్కడ క్రాప్ హాలిడే యూరియా యాపులు పెట్టి ప్రజల ఉసురు పోసుకుంటున్నారు.. నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి.. కరెంట్ ఇవ్వలేక చేతులు ఎత్తుతున్నారు.. కేసీఆర్ పాలనలో ఈ సమస్యలు లేవు.. మీరు రాగానే ఎందుకు మొదలయ్యాయి అని హరీష్‌రావు ప్రశ్నించారు. విద్యార్థులు పీజు రీయింబర్స్‌మెంట్ కోసం, ఉద్యోగులు పీఆర్సీ, డీఏ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కరోనా ఉన్నా పెద్ద నోట్ల రద్దు ఉన్నాక కేసీఆర్ రూ.20వేల కోట్ల పీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేశారు అని చెప్పారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని, 22ఏ పెట్టి రాత్రికి రాత్రి పేదల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజల గుండెపై బండ వేశారని అన్నారు. నాలుగు వేల పింఛన్ ఏమైంది.. పెంచుతానన్న రైతు భరోసా ఏది అని రైతులు అడుగుతున్నారు.. వెయ్యి రోజులు అయినా నీ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు.. బకాయిలతో సహా చెల్లించాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

**హకీంపేట్ వద్ద హరీష్ రావు, ఇతర ఎమ్మెల్యేల అరెస్ట్**

కేసీఆర్‌కి రక్షణగా వెళ్తున్న తమను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు పీకలదాకా తాగి కేసీఆర్ ఇంటిపై దాడికి వెళ్తున్న కాంగ్రెస్ గూండాలకు, ఎమ్మెల్యేలకు మాత్రం పైలట్ ఎస్కార్ట్ ఇచ్చి మరీ పంపుతున్నారు.. అసలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు అడిగారు. కేసీఆర్ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి వెళ్తున్నారన్న సమాచారంతో ఆయనకు రక్షణగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్ తదితరులను మేడ్చల్ మల్కాజిగిరి కమిషనర్ సుమతి ఆధ్వర్యంలో పోలీసులు హకీంపేట వద్ద హరీష్‌రావు, ఇతర ఎమ్మెల్యేలను అరెస్టు చేసి జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్కడ విలేకరులతో హరీష్‌రావు మాట్లాడారు. నిన్నటికి నిన్న మహిళా ఎమ్మెల్యేల గొంతులు పిసికి, చీరలు లాగిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈరోజు తెలంగాణ సాధించిన నాయకుడు, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపైకే దాడికి పంపింది.. స్వయంగా హోంమంత్రి శాఖను కూడా తన చేతిలోనే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే దగ్గరుండి ఈ దాడి చేయిస్తున్నారు అని హరీష్‌రావు ఆరోపించారు. రాజ్యాంగం పుస్తకం చేతిలో పట్టుకుని తిరుగుతూ ప్రజాస్వామ్యం గురించి పోజులు కొట్టే రాహుల్ గాంధీని నేను సూటిగా అడుగుతున్నాను.. మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ అప్రజాస్వామిక చర్యలను, దాడులను సమర్థిస్తావా.. మీరు ప్రజలకు ఇచ్చిన ఏడవ గ్యారెంటీ ఇదేనా రాహుల్ గాంధీ అని ప్రశ్నించారు. ఆనాడు అస్సాం ముఖ్యమంత్రి నీ పుట్టుకను ప్రశ్నిస్తే మీ పార్టీ ముఖ్యమంత్రులు సైతం నోరు మెదపలేదు. కానీ నాడు నీకు మానవత్వంతో, నిజాయతీగా మద్దతుగా నిలబడింది కేసీఆర్. ఆరోజు నీకు అండగా నిలబడినందుకు ఇవాళ కేసీఆర్ ఇంటి మీదకే గూండాలను పంపుతావా? నీకు నిజంగా రాజ్యాంగం మీద నమ్మకం ఉంటే, నువ్వు మాట్లాడే మాటల్లో కొద్దిపాటి నిజాయతీ ఉన్నా తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకో అని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్.. కేసీఆర్ చావాలి, కేసీఆర్ చావును మేం కోరుకుంటున్నాం అని పబ్లిక్‌గా అన్నాడంటే అది శంకర్ మాట కాదు.. ముమ్మాటికీ రేవంత్ రెడ్డి మాటే.. రేవంత్ రెడ్డి ప్రతిరోజూ కేసీఆర్ చావును కోరుకుంటున్నాడు.. తన ఎమ్మెల్యేలతో కేసీఆర్‌ని తిట్టిస్తున్నాడు.. దాడులు చేయిస్తున్నాడు. రేవంత్ రెడ్డి.. అసలు నువ్వు కూర్చున్న ఆ ముఖ్యమంత్రి కుర్చీ కేసీఆర్ పెట్టిన భిక్ష. కేసీఆర్ ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడి తెలంగాణ సాధించకపోతే ఇవాళ నీకు ఈ ముఖ్యమంత్రి పదవి ఎక్కడిది అని వ్యాఖ్యానించారు. ఈరోజు పోలీసుల రక్షణలో కాంగ్రెస్ గూండాలు, ఎమ్మెల్యేలు కేసీఆర్ ఇంటిపై చేసిన ఈ దాడిని తెలంగాణ సమాజం, బీఆర్ ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అని హరీష్‌రావు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

**మొదటిపేజీ తరువాయి**

కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దరఖాస్తు సమయంలో ధరావతు(ఈఎండీ)గా రూ.10వేలను స్వీకరించారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులతోపాటు ఈఎండీ మొత్తాన్ని కూడా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే తీసుకున్నారు. ఈ ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తి అయినందున ఎంపిక కాని దరఖాస్తుదారులకు ఈఎండీని తిరిగి చెల్లిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. దరఖాస్తుదారులు తాము ఏ అకౌంట్ నుంచి ఈ మొత్తాన్ని చెల్లించారో అదే అకౌంట్‌కు జమ చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని, వారంలోగా ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. అయితే కొందరు దరఖాస్తుదారులు తాము మీ సేవా కేంద్రాల్లో నగదు ద్వారా చెల్లించామని, లేదా ఇతరుల అకౌంట్ నుంచి చెల్లించామని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇలా చెల్లించిన వారికి ఈ ధరావతు మొత్తం వారికే జమ అయ్యేలా చూడటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tsస్త్రb.tవశ్రీaఅస్త్రaఅa.స్త్రశీజ. అఅ ద్వారా ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఏ అకౌంట్ ద్వారా చెల్లింపు జరిగిందో అదే అకౌంట్‌కు తిరిగి జమ అవుతుందని తెలిపారు.

**కొనసాగుతున్న వెరిఫికేషన్**

లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదని, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుందని గౌతం తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అర్హులైన వారికి ఇండ్ల కేటాయింపు పత్రాలను(అలాట్‌మెంట్ లెటర్) అందచేస్తామన్నారు. ప్రతిపాదించిన 7,340 ఇండ్లకు వెయిటింగ్ లిస్టుతో కలిపి సుమారు పదివేల మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. వెరిఫికేషన్ తరువాత లబ్దిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని ఏ విధంగా, ఏ ఖాతాలో చెల్లించాలన్న దానిని అలాట్‌మెంట్ లెటర్‌లో పొందుపరుస్తామన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు లాటరీలో ఎంపికైన వారు సహకరించాలని వైస్ చైర్మన్ కోరారు. ఈ ఇండ్లకు సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా హౌసింగ్ బోర్డు కార్యాలయాలచుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వాట్సాప్/ఎసఎంఎస్ వంటి వాటి ద్వారా అవసరమైన సమాచారం అందిస్తున్నామని, ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్‌కు ఫోన్ 040I24603572) చేయవచ్చని సూచించారు.

**నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు 10వ తేదీ ఆఖరు**

ఇందిరమ్మ టవర్స్ పథకంలో తొలుత 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించి లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు ప్రక్రియను కూడా పూర్తి చేయగా మరో నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగు తున్నది. చాంద్రాయణగుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న టవర్స్‌లోని ఇండ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 10 వరకు సమర్పించవచ్చనీ, ఈ నియోజకవర్గాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌతం విజ్ఞప్తి చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** శాసనసభలో తమ పార్టీ మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర డ్రామాలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పరిపాలనా వైఫల్యాలు, '420' హామీలు సహా అన్ని ప్రజా సమస్యలపై శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, ప్రతీ అంశంపైనా స్పష్టమైన సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు సభలో చర్చకు రాకుండా తప్పించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చిల్లర వేషాలు వేస్తోందని, ఈ పరిణామాలన్నింటినీ ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడేవారు బీఆర్ఎస్‌లో ఎవరూ లేరని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరుగుతున్న దాడి, అరెస్టుల అంశంపై శాసనమండలిలో ఖచ్చితంగా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకురాళ్లపై జరిగిన దాడికి, బనాయించిన కేసులకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని తేల్చిచెప్పారు.

# ఎర్రవల్లిలో హైటెన్షన్

**సిద్దిపేట, సెప్టెంబర్ 8:** సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి, దామరకుంట ప్రాంతాలు మంగళవారం తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు కేంద్రంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు చేపట్టిన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీ సింది. కాంగ్రెస్ శ్రేణులను బీఆర్ఎస్ కార్యక ర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్పై రాళ్ల దాడి కూడా జరిగింది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. శాసనసభ స్పీకర్ గడ్డం "ప్రసాద్కుమార్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ లు తీవ్ర పదజా లంతో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతలు కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడికి పిలుపునిచ్చారు. 'వెయ్యి డప్పులతో' ఫామ్స్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావడంతో పోలీసులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు కూడా పెద్ద సంఖ్యలో ఎర్ర పల్లి వైపు కదిలే అవకాశం ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల కార్యక్రమాలు జరగనున్న నేపథ్యం లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రవల్లి వైపు కదులుతున్న సమయంలో దామరకుంట వద్ద బీఆర్ఎస్ శ్రేణులు వారిని అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది.

**కాంగ్రెస్ కాన్వాయ్ పై రాళ్ల దాడి**

జరిగినట్లు సమాచారం. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇరువర్గాల మధ్యకు వచ్చి వారిని వెనక్కి పంపించే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది పోలీసులకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. కాంగ్రెస్ ముట్టడి పిలుపుతో ఎర్రవల్లి పరిస రాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఫామహౌస్కు వెళ్లే ప్రధాన రహదారుల్లో బారికే డ్లు, చెక్పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేపట్టారు. ఫామ్ హౌస్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు చేసి, అదనపు పోలీసు బలగా లను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎర్రవల్లి వైపు వెళ్లే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేం దుకు పోలీసు బలగాలను మోహరించారు. అవస రమైతే ఆందోళనకారులను అదుపులోకి తీసుకు నేందుకు డిటెన్షన్ వాహనాలను కూడా సిద్ధంగా చేశారు. దామరకుంటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలుసు కున్న వెంటనే బీఆర్ఎస్ అగ్రనేతలు ఎర్రవల్లి వైపు కదిలారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అసెంబ్లీ నుంచి నేరుగా ఎర్రవల్లి వైపు బయలుదేరిన వారి వాహనా లను పోలీసులు బొల్లారంహకీంపేట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం. వ్యక్తం చేశారు. తమ పార్టీ అధినేత నివాసానికి వెళ్లడాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను ప్రశ్నిస్తూ నేతలు వాగ్వాదానికి దిగారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు కేటీఆర్, హరీశ్రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. హరీశ్రావును జవహర్ నగర్ పోలీస్ స్టేషను, కేటీఆర్ ను బోయినపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలను కూడా వివిధ ప్రాంతాల్లో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ శ్రేణుల కదలికలను కూడా పోలీసులు నియంత్రించారు. ఉదయం నుంచే ఎర్రవల్లిఫామ్ హౌస్ పరిసరాలు పోలీసుల ఆధీనంలోకి వెళ్లినట్లు కనిపించింది. ప్రధాన రహదారుల వద్ద చెక్ పోస్టులు, బారికేడ్లు ఏర్పాటు చేసి అనుమానాస్పద కదలికలను నియంత్రించారు. ఫామ్ హౌస్ వైపు వెళ్లే మార్గాల్లో పోలీసు బలగాలను మోహరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్ హౌస్ సమీపానికి చేరకుండా పోలీసులు అడ్డుకోవడం, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు తమ అధినేత ఫామ్ హౌస్ వద్దకు చేరేందుకు ప్రయత్నించడం వల్ల భద్రతా చర్యలు మరింత కఠినతరం అయ్యాయి. కేసీఆర్ రాజకీయ ప్రస్థానంలో గజ్వేల్, ఎర్రవల్లి ప్రాంతా లకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. బీఆర్ఎస్ అధినేత రాజకీయంగా కీలక నిర్ణయాలు తీసుకునే సంద ర్భాల్లో ఎర్రవల్లి ఫామ్ హౌస్ ప్రాధాన్యం సంతరిం చుకున్న విషయం తెలిసిందే. అలాంటి ప్రాంతంలో నే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు భారీ నిరసనకు దిగడం, వారిని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడం, ఆ తర్వాత బీఆర్ఎస్ అగ్రనేతలు స్వయంగా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. మంగళవారం జరిగిన పరిణామాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు ఇకపై కేవలం అసెంబ్లీ వేదికకే పరిమితం కాదనే సంకేతాలను ఇచ్చాయి. మొత్తంగా చూస్తే మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి, దామరకుంట ప్రాంతాలు రాజకీయాల్లో హాట్ స్పాట్‌గా మారాయి. కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్ శ్రేణుల ప్రతిఘటన, రాళ్ల దాడి తోపులాట, కేటీఆర్‌హరీశ్రావుల ఎర్రవల్లి ప్రయాణం, పోలీసుల అడ్డగింత అరెస్టులు, 144 సెక్షన్ అమలు, భారీ బందోబస్తు.. ఇలా వరుస పరిణామాలతో సిద్దిపేట జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా మార్పు రావడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

# తిట్టింది నా తల్లిని.. నీకెందుకు ఆగ్రహం?

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ బయట చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు క్షమాపణకు పట్టుబట్టగా.. బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు స్పందించారు. ఈ క్రమంలో స్పీకర్, హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మహిళా ఎమ్మెల్యేల వ్యవహారంపై అభ్యంతరం**

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు అవమానించారని హరీశ్‌రావు సభలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెబుతారని తాము భావించామని అన్నారు. ఇదే సందర్భంలో తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ స్పీకర్ అలా భావిస్తే మధు ఇప్పటికే క్షమాపణ చెప్పారని వివరించారు.

**హరీశ్ వ్యాఖ్యలపై స్పీకర్ ఆగ్రహం**

హరీశ్‌రావు మాట్లాడిన తీరుపై స్పీకర్ తీవ్రంగా స్పందించారు. ఎంతో సీనియర్ సభ్యుడైన హరీశ్‌రావు మాట్లాడిన తీరు సరిగా లేదన్నారు. తన తల్లిని తిట్టారని, హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. తనకు ఆగ్రహం ఉంటుందని స్పష్టం చేస్తూ.. "నీ తల్లిని తిట్టనప్పుడు నీకెందుకు ఆగ్రహం?" అంటూ హరీశ్‌రావును నిలదీశారు.

**సోదరీమణులతో సమానమని వెల్లడి**

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని తాను సోదరీమణులతో సమానంగా భావిస్తానని స్పీకర్ తెలిపారు. వారిపై దాడి జరిగిందని తెలియగానే నివేదిక కోరినట్లు చెప్పారు. నివేదిక అందిన తర్వాత తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**'నన్ను బెదిరించలేవు'**

ముందుగా తన తల్లిని తిట్టిన అంశంపై హరీశ్‌రావు మాట్లాడాలని స్పీకర్ వాయిస్ పెంచుతూ అన్నారు. ఒక దశలో హరీశ్‌రావును ఉద్దేశించి తనను బెదిరించలేవని హెచ్చరించారు. దీంతో అసెంబ్లీలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# స్పీకర్‌కు సీఎం రేవంత్ పరామర్శ

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** బీఆరఎస్ నాయకులు ఏకంగా స్పీకర్‌ని అసభ్యకర పదజాలంతో దూషించి మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానపరిచేలా వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎదుట జరిగిన ఈ దురదృష్టకర పరిణామాలపై పత్రికలు, టీవీలు, అన్ని మీడియాలు ప్రముఖంగా ప్రచురించాయన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను సీఎం పరామర్శించారు.

# రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప చావు కోరుకోవడమేంటి?

- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఎందుకు చర్యలు తీసుకోరు?**
- **ప్రతిపక్ష నాయకుడి ఇంటిమీదికి దండయాత్రా**
- **అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి**
- **టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోటి దురుసుతో ప్రత్యర్థి నాయకులను, కులాలను, వ్యవస్థలను దూషించడం, దుర్భాషలాడటం ఇదే మొదటిసారి కాదు.. అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం విచిత్రంగా వుందన్నారు. అంటే ఆయన దూషణలను కాంగ్రెస్ సమర్థిస్తుందా? ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటీ? ఒక ముఖ్యమంత్రే తన పార్టీ నాయకులను ఇలాంటి దాడికి ఉసిగొల్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం పని చేస్తోందని ఆ ప్రకటనలో ప్రశ్నించారు. ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు అందక విద్యార్థులు, 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు నమోదు అయి రైతులు, ప్రజలు, ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వరుసగా జరుగుతోన్న అఘాయిత్యాలు, హత్యాచారాలతో భయం భయంగా మహిళలు కాలం గడుపుతున్నారు. నాణ్యమైన భోజనం, వసతులు లేక గురుకులాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు సహా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండు రోజులుగా విలువైన సభా సమయాన్ని వృథా చేశాయి, రేపటి నుంచి అయినా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి.. వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కవిత కోరారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

- **అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత**
- **అరెస్టులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో, నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభ రోజే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశాల మేరకే వారిని అడ్డుకుంటున్నామని పోలీసులు చెప్పడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**తాతా మధుపై కేసు**

ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. స్పీకర్‌ను కులం పేరుతో దూషించడంతోపాటు అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మరో ఎమ్మెల్సీ అరెస్ట్**

తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కఠిన చర్యలకు డిమాండ్**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మరుసటి రోజే ఇద్దరు ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తమ ఎమ్మెల్సీల అరెస్టుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సభాపతిని అవమానించడం దురదృష్టకరం.!

- తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.
- వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు
- వజనాల విశ్వాస్.



**వట్పల్లి,సెప్టెంబర్ 9 (సిరి న్యూస్)**

తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అనుచిత వ్యాఖ్యలను వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజనాల విశ్వాస్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్ వ్యక్తిగత గౌరవాన్ని, ముఖ్యంగా ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, ప్రభుత్వ విధానాలను, రాజకీయ నిర్ణయాలను విమర్శించవచ్చని, అయితే ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను, ముఖ్యంగా తల్లిదండ్రులను రాజకీయ విమర్శల్లోకి తీసుకురావడం ఏ మాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ఇది రాజకీయ సంస్కారానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఒక దళిత కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థానానికి ఎదగడం కొందరికి ఎందుకు అసహనంగా మారుతోందని వజనాల విశ్వాస్ ప్రశ్నించారు. ఒక తల్లి తన బిడ్డను పెంచి ప్రజాసేవకు పంపితే, ఆ తల్లిని అవమానించే పరిస్థితి ఎందుకు రావాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ పదవి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, అది శాసనసభకు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించిన అత్యంత గౌరవప్రదమైన పదవి అని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి సభా రికార్డులు, వీడియోలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను సిద్ధాంతాలు, విధానాల ఆధారంగా విమర్శించాలని, కానీ వారి కుటుంబ సభ్యులను, తల్లిదండ్రులను అవమానించడం రాజకీయ సంస్కారం కాదని వజనాల విశ్వాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో ఇలాంటి అనుచిత సంస్కృతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని పేర్కొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

- - మెరిట్ స్కాలర్‌షిప్ ఫండ్‌కు రూ.10,000 ప్రైజ్ మనీ విరాళం.



సదాశివపేట. సెప్టెంబర్ 8. (సిరిన్యూస్)
ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేట ఆర్థికశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. మురళీకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి ఆధ్వర్యంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి మాట్లాడుతూ డాక్టర్ పి. మురళీకృష్ణ కళాశాల అభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు కళాశాల ప్రగతికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ద్వారా తనకు లభించిన రూ.10,000 నగదు బహుమతిని కళాశాలలోని మెరిట్ స్కాలర్‌షిప్ ఫండ్‌కు డాక్టర్ పి. మురళీకృష్ణ విరాళంగా అందజేశారు. తనకు లభించిన ప్రైజ్ మనీని తిరిగి కళాశాల విద్యార్థుల ప్రయోజనాల కోసం అందించడం ఆనందించదగిన విషయమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.
డాక్టర్ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటలో సేవలందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కళాశాలలో పనిచేస్తున్న సమయంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందడం, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం తనకు ఎంతో సంతోషకరమైన విషయాలని తెలిపారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతోనే అవార్డు ద్వారా వచ్చిన రూ.10,000 ప్రైజ్ మనీని మెరిట్ స్కాలర్‌షిప్ ఫండ్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని డాక్టర్ పి. మురళీకృష్ణకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

# రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ

- కొత్తగా వైద్యుల కేటాయింపు..
- త్వరలో మరిన్ని ప్రత్యేక వైద్య సేవలు.
- డీసిహెచ్ డాక్టర్ శివ దయాల్.

**రామాయంపేట, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్ )**

రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం కొత్తగా వైద్యులను కేటాయించడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, అనస్థీషియా, చిల్డ్రన్ స్పెషలిస్ట్‌తో పాటు ఐదుగురు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. దీంతో స్థానిక ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీహెచ్ శివ దయాల్ తెలిపారు. మంగళవారం నాడు రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి డాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

**త్వరలో గైనకాలజిస్ట్ సేవలు**

మహిళలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు త్వరలో గైనకాలజిస్ట్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు**

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, సలహాలు, ప్రసవ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



**త్వరలో డయాలసిస్ కేంద్రం**

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే డయాలసిస్ కేంద్రాన్ని కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే రామాయంపేటతో పాటు పరిసర ప్రాంతాల రోగులకు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తగ్గనున్నాయి. వైద్యుల నియామకంతో పాటు ప్రత్యేక వైద్య సేవలు, ప్రసవ సేవలు, డయాలసిస్ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానుండటంతో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ పట్టనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# శాంతియుతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

- అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- జిన్నారం సీఐ రమణారెడ్డి సూచన




**గుమ్మడిదల, సెప్టెంబర్ 8( సిరి న్యూస్):**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మండపాల నిర్వాహకులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధితో పాటు గుమ్మడిదల మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల ప్రతినిధులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ముఖ్యంగా మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ల విషయంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అజాగ్రత్తగా ఏర్పాటు చేసే విద్యుత్ వైర్లు, తాత్కాలిక కనెక్షన్లు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారుల సూచనల మేరకే ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందించే విధంగా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో మండపాల ఏర్పాటు, రహదారులపై ఆక్రమణలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే చర్యలను నివారించాలని తెలిపారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రహదారులపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా పోలీస్ శాఖ సూచించిన మార్గాలను అనుసరించాలని కోరారు. అధిక శబ్దంతో సౌండ్ సిస్టంలు, డీజేలు వినియోగించడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే వాటిని వినియోగించాలని స్పష్టం చేశారు.

**సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలే పరిష్కారం**

వినాయక ఉత్సవాల సందర్భంగా చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని ఎస్సై అరుణ్ కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ భద్రత లోపించడం, మండపాల వద్ద అగ్నిమాపక జాగ్రత్తలు తీసుకోకపోవడం, రహదారులను పూర్తిగా అడ్డుకోవడం, ఊరేగింపుల్లో క్రమశిక్షణ పాటించకపోవడం వంటి అంశాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. వీటికి పరిష్కారంగా ప్రతి ఉత్సవ కమిటీ ముందస్తుగా పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వినాయక ఉత్సవాలను మతసామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవంతో నిర్వహించాలని కోరారు. పోలీస్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా వెంటనే పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు లేదా సంబంధిత శాఖల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమన్వయం, క్రమశిక్షణ, ముందస్తు జాగ్రత్తలతోనే వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌తో పాటు వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు కింద పడి రెండేళ్ల బాలుడు మృతి



**సదాశివపేట.సెప్టెంబర్ 8.(సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. సిద్దాపూర్ కృష్ణానగర్ కాలనీకి చెందిన టైటాస్ విద్యార్థి పాఠశాల నుండి స్కూల్ బస్సులో ఇంటికి రాగా, అన్నను చూసిన తమ్ముడు ఎఫ్రాయిర్ జీనియస్ స్కూల్ బస్సు నుండి తీసుకురావడానికి వెళ్ళాడు.బస్ డ్రైవర్ గమనించకుండా బస్సును వెనకకు తీయడంతో టైర్ కిందపడి బాలుడు మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తహశీల్దార్ బిఎల్ఓ లకు శిక్షణ సదస్సు




**సదాశివపేట.సెప్టెంబర్ 8. (సిరిన్యూస్)**

సోమవారం మున్సిపల్ కార్యాలయంలో తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ బి ఎల్ ఓ లకు శిక్షణ సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసినచో డాక్యుమెంట్స్ అప్లోడింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై బిఎల్ఓ లకు క్షుణ్ణంగా వివరించారు. ప్రజలకు సర్ నోటీసులు వచ్చినా కూడా ఎటువంటి భయభ్రాంతులకు గురి కావద్దని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కిరణ్, ఆరిఫ్, ఆర్ ఐ లు సాయి, మంజులత, మున్సిపల్ డబ్ల్యూ ఓ స్వామి, ట్రైనర్ మల్లేశం, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# పోల శ్రీనివాస్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**సదాశివపేట.సెప్టెంబర్ 8. (సిరిన్యూస్)**

లయన్స్ క్లబ్ సంగారెడ్డి ఆధ్వర్యములో జిల్లా స్థాయి లో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమములో సదాశివపేటకు చెందిన పోల శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ మిర్జాపూర్ (బి)ని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో లయన్స్ క్లబ్ సంగారెడ్డి చైర్మన్ శాంకరీ విజయేందర్ రెడ్డి, సెక్రటరీ రాములు గౌడ్, కోశాధికారి అనంతరావు కులకర్ణి , డిస్ట్రిక్ట్ చైర్మన్ రామప్ప, కో చైర్మన్ హనుమంత్ గౌడ్, మంగళపర్తి వెంకటేశం సభ్యులు పాల్గొన్నారు.

# నరేష్‌కుమార్‌కు లయన్స్‌క్లబ్ రాష్ట్ర స్థాయి అవార్డు

**జోగిపేట, సెప్టెంబర్ 08, (సిరి న్యూస్):**



జోగిపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్‌కుమార్‌కు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుతో సత్కరించారు. మంగళవారం హైద్రాబాద్‌లో జరిగిన ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ విజయలక్ష్మి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువా,పూలమాలలతో సన్మానించారు. అంకిత భావంతో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న నరేష్‌ను అవార్డుకు ఎంపిక చేయడం పట్ల జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య, పీఆర్‌టీయు జోగిపేట అర్బన్ అధ్యక్షుడు నరోత్తం, ఉపాధ్యాయ బందం అభినందించారు. రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడం పట్ల నరేష్‌కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేసారు.

# రాజేశ్వరికి జాతీయ స్థాయి భారత గురు రత్న అవార్డు




**జోగిపేట, సెప్టెంబర్ 08, (సిరి న్యూస్):**

విద్యారంగంలో అంకతభావంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించేందుకు శారదా. ఎడ్యుకేషనత్సాసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతాలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్య క్రమంలో సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన ఉపాధ్యాయురాలు రంగంపేట రాజేశ్వరికి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక 'భారత గురు రత్న' అవార్డును అందజేసారు. విజ్ఞానంతోపాటు పర్యావరణహిత విద్యకు, నిరంతర కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందజేసారు. జాతీయస్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యను బోధించడమే కాకుండ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తూ వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడమేనని ఆమె అన్నారు. తాను ప్రస్తుతం కానుకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలిపారు. తనకు అవార్డు రావడంతో మరింత భారం పెరిగిందన్నారు.

# ఎస్ఐఆర్ జాబితాపై అధికారుల పరిశీలన



- బస్వాపూర్ గ్రామ సభకు హాజరైన తహసిల్దార్ గ్రామ సర్పంచ్

వెల్దుర్తి,సెప్టెంబర్ 08,( సిరి న్యూస్ ):

వెల్దుర్తి మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ జాబితా పరిశీలనలో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభకు మండల తహసీల్దార్ విజయలక్ష్మి హాజరై ప్రక్రియను పరిశీలించారు. గ్రామసభలో ఎస్ఐఆర్ ప్రక్రియలో తిరస్కరణకు గురైన వారి జాబితాను అధికారులు పరిశీలించారు. జాబితాలోని వివరాలు, తిరస్కరణకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ సంబంధిత ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఎస్ఐఆర్ జాబితాలో తిరస్కరణకు గురైన వివరాలపై గ్రామస్థుల అభ్యంతరాలు, సంబంధిత అంశాలను గ్రామసభ వేదికగా పరిశీలించడం ద్వారా అర్హులైన వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్ జిపిఓ, పంచాయతీ సెక్రెటరీ, వార్డ్ మెంబర్లు ,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరం



- జోగిపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, చిట్టిబాబు
- జోగిపేటలో 52 మందికి ఇందిరమ్మ ఇళ్ల సర్టిఫికెట్ల పంపిణీ

జోగిపేట, సెప్టెంబర్ 08 (సిరి న్యూస్)

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రెండవ విడతలో అందోల్- జోగిపేట మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన 52 లబ్ధిదారులకు ఇళ్ల మంజూరి సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్మెన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, కమిషనర్ సిహెచ్. తిరుపతిలు అందజేశారు.

మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో బాగంగా చైర్మన్ పర్యటన



తూప్రాన్ సెప్టెంబర్ 08 సిరి న్యూస్

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలో పరిశుభ్రతలో బాగంగా మంగళవారం.1వ వార్డులో మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చైర్మన్ కమిషనర్ ఇంటింటి పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలని ప్రజలకు స్వయంగా చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ కోరారు

# సెప్టెంబర్ 10న "చలో హైదరాబాద్" విజయవంతం చేయాలి..

హత్నూర, సెప్టెంబర్ 08,(సిరి న్యూస్):

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ( టి జి ఈ జె ఎ సి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ జి టి యు సంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సి పి ఎస్ ను రద్దు చేసి ఓ పీ ఎస్ ను అమలు చేయాలని, పి ఆర్ సీ ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వం నుంచి డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం అవసరమని పేర్కొంది. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సెలవు పెట్టి పెద్ద సంఖ్యలో తరలిరావాలని, పెన్షనర్లు సైతం అధిక సంఖ్యలో పాల్గొని "చలో హైదరాబాద్"ను విజయవంతం చేయాలని ఎస్ జి టి యు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య కోరారు.

# అవమానం భరించలేకనే పోచయ్య ఆత్మహత్య

- బుస్స పోచయ్య కుటుంబానికి అండగా ఉంటాం.
- ఫోన్ చేసి ధైర్యం చెప్పిన టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత.
- పోచయ్య కుటుంబాన్ని కలిసిన బట్టి అజయ్.
- న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా

మెదక్ సెప్టెంబర్, 08(సిరి న్యూస్)





ఫారెస్ట్ అధికారుల వేధింపులు, అవమాన భారం భరించలేకనే బుస్స పోచయ్య ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన సుమారు 55 ఏళ్ల బుస్స పోచయ్య సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటనపై తెలంగాణ రక్షణ సేన పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోచయ్య కుటుంబంలో శుభకార్యం ఉండటంతో, ఆయన చిన్న కుమారుడి భార్య శ్రీమంతం కార్యక్రమం కోసం అవసరమైన కట్టెలను సమీపంలోని అడవిలో నుంచి తీసుకురావడానికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు తమను అదుపులోకి తీసుకుని ఫారెస్ట్ రేంజర్ కార్యాలయానికి తీసుకెళ్లారని, అక్కడ తమపై చిత్రహింసలకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన పోచయ్య అవమానం, బాధను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితమ్మ సూచనల మేరకు మంగళవారం బట్టి అజయ్ పాతూరు గ్రామానికి వెళ్లి పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి కుటుంబ బాధను విని, కుటుంబానికి ధైర్యం చెప్పారు. అదే విధంగా కల్వకుంట్ల కవితమ్మ కూడా పోచయ్య కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబం ఒంటరిగా లేదని, తెలంగాణ రక్షణ సేన పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ తరపున పోరాటం కొనసాగుతుందని, అవసరమైన న్యాయపరమైన సహాయాన్ని పార్టీ లీగల్ టీమ్ ద్వారా అందిస్తామని కవితమ్మ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చేస్తాం అని బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారి వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన పార్టీబాధితుల పక్షాన నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసాపురం అశోక్ వేపూరి శ్రీనివాస్, అబ్బాస్, టీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు.

# అరెస్టులకు భయపడం.!

- ప్రజా పాలన ఇదేనా.?
- ఇదేనా ఇందిరమ్మ రాజ్యం.?
- ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ కు వెళ్తే అరెస్టుల... మాకు కేసులు కొత్తేమి కాదు.
- అక్రమంగా అరెస్టు చేసి ములుగు పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు.
- కాంగ్రెస్ నేతలకు దారి.. బీఆర్ఎస్ నేతలకు అరెస్టులా?"
- మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ధ్వజం.

మెదక్ సెప్టెంబర్,08(సిరిన్యూస్)



మా పార్టీ అధినేతను కలవడానికి మేము వెళ్తుంటే అడ్డుకుంటారా? కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించడానికి వెళ్తే మాత్రం వారికి దారి ఇస్తారా? అధికార పార్టీకి ఒక న్యాయం.. ప్రతిపక్షానికి మరో న్యాయమా? ఇదేం ప్రజాస్వామ్యం?" అంటూ మాజీ ఎమ్మెల్సీ కేసిఆర్ రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లి వెళ్తున్న కారును ములుగు పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆయన అక్కడే పోలీసులను ప్రశ్నిస్తూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**ముట్టడికి వెళ్లేవారిని ఎందుకు అడ్డుకోరు?**

కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు వెళ్తున్నారని, వారిని అడ్డుకోకుండా తమ పార్టీ నాయకులను మాత్రం ఎక్కడికక్కడ నిలువరిస్తున్నారని ఆరోపించారు.
కేసీఆర్ మా పార్టీ అధినేత. ఆయనను కలవడానికి వెళ్లడం మా హక్కు. మేము ఎర్రవల్లికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారు. నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. అదే కాంగ్రెస్ నాయకులు ఫామ్‌హౌస్ ముట్టడికి వెళ్తుంటే వారిని ఎందుకు అడ్డుకోవడం లేదు?" అని నిలదీశారు. రాష్ట్రం లో దుర్మార్గమైన పాలన నడుస్తుందని, రేవంత్ సర్కారుపై నిప్పులు చేరిగారు. ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా ఏం పాలన చేస్తున్నారో రేవంత్‌రెడ్డికే తెలియాలి. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా ప్రజాపాలన?" అంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రతిపక్ష నాయకుల కదలికలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఉద్యమకారులు, ప్రతిపక్ష నేతల విషయంలో అణచివేత ధోరణిని విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యేలకు ఇచ్చే గౌరవం ఇదేనా!

- ప్రజాస్వామ్యంలో నిరసన తెలుపడం తప్పా!
- రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి
- నిరంకుశ పాలన నడుస్తుంది
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు విలువలేదు
- పోలీసుల తీరుపై భగ్గుమంటున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్ సెప్టెంబర్ 8 (సిరి న్యూస్)




అసెంబ్లీ సమావేశాల్లో జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో420 హామీలతో ప్రజలను మోసం చేసిందని టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ముందు నిరసన తెలిపే క్రమంలో ఎమ్మెల్యేలకు మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండ పోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం అందులో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అవమానం, గాయాలు కావడంతో దీని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మహిళలు మంగళ వారం నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి నిరసనలు తెలిపారు వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలన జరుగుతుంది అని ఎమ్మెల్యేలు మహిళలు అని చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యే వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యం విరుద్ధం అని అన్నారు ప్రభుత్వం పై ప్రజలలో వ్యతిరేకత వస్తుందని మహిళ ఎమ్మెల్యే సునీత రెడ్డి పట్ల పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం చెందిందని వెయ్యి రోజులు పాలన అని గొప్పలు చెప్పుకుంటూ కాలం సాగదీస్తున్నారని అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీతా రెడ్డికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేకుంటే రాబోయే రోజులలో కాంగ్రెస్ నాయకులకు సరైన బుద్ధి చెప్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భోగా శేఖర్ మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లు సర్పంచులు మహిళలు పాల్గొన్నారు

# చలో హైదరాబాద్ విజయవంతం చేద్దాం



- ఉద్యోగ, ఉపాధ్యాయులు పటాన్ చెరు లో పోస్టర్ ఆవిష్కరణ

పటాన్ చెరు, సెప్టెంబర్ 8, (సిరి న్యూస్)*:

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హక్కుల సాధన కోసం టిజిఈజెఎసి పిలుపు మేరకు సెప్టెంబర్ 10 నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ ను విజయవంతం చేద్దామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిస్తూ పోస్టర్ ఆవిష్కరించారు. వేతన సవరణ కోసం, పెండింగ్ డీఏల విడుదల కోసం, పెండింగ్ బిల్లుల చెల్లించాలని, సీపీఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ కోసం, హెల్త్ స్కీం పతిష్టవంతంగా అమలు కోసం హామీ ఇచ్చి, అమలు కానీ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రధాన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 10 నాడు చలో హైదరాబాద్ కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ తప్పకుండా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పీఆర్ టీయూ టిఎస్మండల అధ్యక్ష్య, ప్రధాన కార్యదర్శులు విఠల్ రెడ్డి, రామానుజం టీపీటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ఎ స్ టి ఓ రాజిరెడ్డి టీపీటీఫ్ మండల అధ్యక్షులు జనార్దన్, టీఎస్ యూ టీ ఎఫ్మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగయ్య నాయుడు, కిష్టయ్య, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, ఎస్టీఓ ఉద్యోగులు, పాల్గొన్నారు.

# ఆర్ఆర్-30 రోడ్డులో బస్సు స్టాప్‌లు ఏర్పాటు చేయాలి

- ఆర్టీసీ ఎండీకి తేనా అధ్యక్షుడు రమణ విజ్ఞప్తి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):



గోపన్‌పల్లి-కొల్లూరు ఆర్ఆర్30 విస్తరణ రోడ్డులో బస్సు స్టాప్‌లు ఏర్పాటు చేయాలని తేనా అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ టీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డికి మంగళవారం లేఖ రాశారు. ఈ మార్గంలో 50 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని, బస్సు స్టాప్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు దూర ప్రాంతాలకు నడిచి వెళ్లడం లేదా ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అనువైన ప్రాంతాలను గుర్తించి వెంటనే బస్సు స్టాప్‌లు ఏర్పాటు చేయాలని, నిర్దేశిత ప్రాంతాల్లో బస్సులు నిలిపేలా డ్రైవర్లు, కండక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని రమణ కోరారు.

# బిఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులు సరికాదు

- మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్



**వెల్దుర్తి,సెప్టెంబర్ 08,(సిరి న్యూస్ ):**

అసెంబ్లీకి వెళ్లే హక్కు ప్రతి ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీకి ఉంటుంది ఆ హక్కును కాలరాయడానికి వెయ్యి రోజుల వారి పరిపాలన వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగడతారని ఉద్దేశంతో పోలీసులను ఉసిగొలిపి శాసనసభ్యులపై శాసనమండలి సభ్యులపై విచక్షణారహితంగా దాడులు చేయించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్ధరాత్రి నుండి బిఆర్ఎస్నా యకులను ముందస్తు అక్రమ అరెస్టులు చేసింది. అంతేకాకుండా ఎర్రవలి కేసీఆర్ ఫామ్హౌస్ ను చుట్టుముట్టడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటారని భయంతో వెల్దుర్తి మండల కేంద్రంలో ముందస్తుగా టిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మెదక్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తన వెయ్యి రోజుల పరిపాలన అట్టర్ ఫ్లాప్ అయిందని ఆ వైఫల్యాలను అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ మార్గదర్శకంలో బయలుదేరిన శాసనసభ సభ్యులు శాసనమండలి సభ్యులు నిలదీసి చర్చ చేస్తారనే భయంతో వారిని అసెంబ్లీకి రాకుండా పోలీసులను పెట్టి వారితో పాశవికంగా దాడులు చేయించి శాసనసభ్యులు అని కూడా చూడకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తించి కింద పడవేసి తొక్కి మహిళ శాసన సభ్యులను మెడలు పట్టి లాక్కెళ్ళడం మాజీ మంత్రివర్యులు సునీత రెడ్డి చీర తొలగిపోయేలా వ్యవహరించడం జగదీశ్వర్ రెడ్డి అస్వస్థకు గురి చేయడం చాలా దారుణమైన సంఘటన... దీనికి నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు ప్రజాస్వామ్యక వాదులు పెద్ద ఎత్తున బయలుదేరి రేవంత్ రెడ్డి చుక్కలు చూపిస్తారని భయపడి అక్రమంగా అర్ధరాత్రి నుండే బిఆర్ఎస్ కార్యకర్తలను నాయకులను అరెస్టు చేయించారని ఇది అప్రజస్వామ్య చర్యగా అభివర్ణించారు...తాత మధుగారు స్పీకర్ను దూషించిన సంఘటనను వాడుకోవడానికి రేవంత్ రెడ్డి తన దిగజారుడుతనాన్ని చూపించాడు... తాత మధు దూషించిన పదాలకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉండగా దానిని కులంకు ఆపాదించి కించపరిచినారని ముఖ్యమంత్రి వక్రీకరించి తన డ్రామాలు తన సభ్యులతో నిన్న అసెంబ్లీలో కొనసాగించి ఒక్కరోజు తప్పించుకున్నాడు.. ఈరోజు కూడా అసెంబ్లీ సమావేశాలలో స్పీకర్ ఎపిసోడ్ తోనే సభను నడపాలనే ప్రయత్నంలో ఉన్నాడు తన ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ జరగద్దనే ఉద్దేశంతో స్పీకర్ ఎపిసోడ్ ను వాడుకుంటున్నాడు.. ఎంత చేసినా రేవంత్ రెడ్డి పతనం ప్రజలలో ప్రారంభమైంది..

**తన పేజీ చినిగే సమయం దగ్గర పడ్డది..**

రేవంత్ రెడ్డి చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని తప్పక ఈ సంఘటనకు తగిన గుణపాఠం రేవంత్ రెడ్డి అనుభవిస్తాడని.. కెసిఆర్ ఫామ్ హౌస్ ముందు డప్పులతో చావు డబ్బులు కొట్టించి కెసిఆర్ చావును కోరుకుంటున్నామని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం తెలంగాణ ప్రజల చేతిలో ఉంటుందని.. దీనికి బదులుగా బి ఆర్ ఎస్ తగిన విధంగా ప్రతీకారం తీర్చుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అశోక్ గౌడ్, సర్పంచ్ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, హస్తల్పూర్ సర్పంచ్ నరసింహారెడ్డి, వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ లు ఉన్నారు.

# అర్హులైన వారందరికి ఓటు హక్కు పొందడమే లక్ష్యం



- జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్

**జోగిపేట, సెప్టెంబర్ 08, (సిరి న్యూస్):**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కు ఓటర్లు సహకరించాలని అందోల్ -జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ కోరారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 15 వార్డులో సర్ నోటీసులపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియను అక్టోబర్ 7 వరకు పొడిగించిందని ఆయన తెలిపారు. నోటీసులు వచ్చిన ఓటర్లు ఏదైనా గుర్తింపు కార్డులు చూపించి ఓటర్లుగా నమోదు చేసు కావాలని కోరారు. తప్పులు ఉన్న ఓటర్ల జాబితాను సవరించేందుకు అధికారులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. తిరుపతి, కో ఆప్షన్ సభ్యులు ఎండి. జీశాన్, బిఎల్ఓ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు

- క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి.

**రామాయంపేట, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్)**





జిల్లాలో ఆరోగ్య సేవలు బలోపేతం చేసే దిశగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందని డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ తెలిపారు. నూతన వైద్యులు గా బాధ్యతలు చేపట్టిన వివిధ రకాల వైద్య నిపుణుల వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం పని చేస్తుందని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ప్రతిరోజు జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను , వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించి తగు సూచనలు సలహాలు అందిస్తున్నారని చెప్పారు అందులో భాగంగానే మంగళవారం నాడు రామాయంపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించడం జరిగిందన్నారు సిబ్బంది విధి నిర్వహణ, నూతనంగా వివిధ రకాల వైద్య నిపుణులు బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, వృత్తి యందు క్రమశిక్షణ నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఆదేశించామని చెప్పారు. . మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలు ఎవరైనా తీవ్రమైన జ్వరాలతో బాధపడినట్లయితే ఆ ప్రాంతానికి హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికున్న వ్యాధులకు అనుగుణంగా చికిత్సలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షకులు డాక్టర్ లింబాద్రి తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. .

# ఎర్రవల్లికి వెళ్లేందుకు యత్నం.. బీఆర్ఎస్ నాయకులు అరెస్ట్



**పటాన్చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసానికి వెళ్లేందుకు ఎర్రవల్లికి బయలుదేరిన పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాల్వగడ్డ రాజ్కుమార్ను పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి హరీశ్రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి రాజ్కుమార్ ఎర్రవల్లికి బయలుదేరారు. అయితే బొల్లారం చౌరస్తా వద్ద పోలీసులు వారిని అడ్డుకుని ఎర్రవల్లికి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో హరీశ్రావు, కేటీఆర్, ఇతర నాయకులతో కలిసి రాజ్కుమార్ కాలినడకన ఎర్రవల్లి వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో హరీశ్రావు, కేటీఆర్, చింత ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో పాటు కాల్వగడ్డ రాజ్కుమార్ను అరెస్ట్ చేసి మల్కాజ్గిరి సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్కు తరలించారు.

# బీహెచ్ఈఎల్ సమస్యల పరిష్కారానికి సీఎండీకి వినతి

- ప్లాంట్ విస్తరణ, నియామకాలు, ఆస్పత్రి నిర్మాణంపై బీఈయూ–సీఐటీయూ డిమాండ్

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**



బీహెచ్ఈఎల్ హెచ్పీఈపీ రామచంద్రాపురం యూనిట్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీహెచ్ఈఎల్ ఎంప్లాయిస్ యూనియన్-సీఐటీయూ ప్రతినిధులు ఢిల్లీలో బీహెచ్ఈఎల్ సీఎండీ కే. సదాశివమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూనిట్ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హెచ్పీఈపీ ప్లాంట్ సామర్థ్యాన్ని 800 మెగావాట్లకు విస్తరించాలని, భారీ వార్షిక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే ఓవర్టైమ్ ప్రారంభించాలని కోరారు. అత్యవసరంగా ఆర్టిసన్ ఉద్యోగాల భర్తీ చేపట్టడంతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక సదుపాయాలతో నూతన ఆస్పత్రి భవనం, ఉద్యోగుల కోసం కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా సబ్కాంట్రాక్ట్ విధానాన్ని తగ్గించాలని, 6వ బ్లాక్లో కాలుష్య సమస్యను పరిష్కరించాలని, ఇంకా అమలు కాని ఇన్సెంటివ్ను అమలు చేయాలని కోరారు. ఓబీసీ ఉద్యోగుల చిరకాల డిమాండ్గా ఉన్న 'పూలే భవనం' నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, యూనిట్ ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని సీఎండీ కే. సదాశివమూర్తి సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సీఐటీయూ నాయకుడు కరుమలయన్తో పాటు బీహెచ్ఈఎల్ సీఐటీయూ నాయకులు పెంటయ్య, శ్రీనివాస్, వీరన్రావు, గంద్రకోటి రమేష్ పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయునిగా రామ్మోహన్ శర్మకు ఘనంగా సన్మానం



- లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో కార్యక్రమం.

**రామాయంపేట, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్)**

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించే రాజకీయంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అయితే లయన్స్ క్లబ్ అఫ్ రామాయంపేట తరుపున ఉత్తమ ఉపాధ్యాయులుగా నిజాంపేటకు చెందిన వేలేటి రాంమోహన్ శర్మను ఎంపిక చేయడం జరిగింది. మంగళవారం నాడు హైదరాబాద్ నగరంలో ని రవీంద్ర భారతిలో లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి, మొదటి గవర్నర్ నరసింహ రాజు,రెండవ గవర్నర్ పద్మావతి చేతుల మీదుగా రామ్మోహన్ శర్మకు అవార్డు అందించడంతో పాటు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన రాంమోహన్ శర్మకు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ టీవీపీ చారి, టీయూడబ్ల్యూజేయు (iju) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి.శ్రీనివాస శర్మ, డిస్ట్రిక్ట్ సెక్రెటరీలు లయన్ దేమే యాదగిరి, లయన్ రాజశేఖర్ రెడ్డి, లయన్ శేషాచారి, డిస్ట్రిక్ట్ చైర్మెన్ లు లయన్ లక్ష్మణ్ యాదవ్,లయన్ కైలాసం,లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట అధ్యక్షులు లయన్ తిరుపతి, కార్యదర్శి లయన్ శివకుమార్, కోశాధికారి లయన్ మద్దెల రమేష్, ఉపాధ్యక్షులు జి పి స్వామి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



- ఇంజనీరింగ్ అధికారులను కోరిన తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్లో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కోరారు. ఈ మేరకు అమీన్పూర్ సర్కిల్ కార్యాలయంలో సీఎంసీ ఇంజనీరింగ్ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ వెంకటరమణ, ఏఈ శివకుమార్తో సమావేశమై వినతిపత్రం అందజేశారు. గతంలో మంజూరైన ఓల్డ్ రామచంద్రాపురం మీట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని, పాషా కాలనీ, శ్రీ సాయి నగర్, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైన్ల పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. డివిజన్లో మిగిలిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇందిరాపార్క్ వద్ద రైస్ మిల్లర్ల మహా ధర్నా..

- తరలి వెళ్లిన రామాయంపేట
- ఉమ్మడి మండల నేతలు.

**రామాయంపేట, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్ )**

తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో రామాయంపేట ఉమ్మడి మండలం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాకు రామాయంపేట నుంచి మిల్లర్లు తరలివెళ్లారు. సీఎంఆర్ సమస్యల పరిష్కారం, మిల్లింగ్ ఛార్జీల పెంపు, పన్నుల భారాన్ని తగ్గించడం, ఇతర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించే వరకు సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయపేట మండల రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు ఇమ్మడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భవాని సిద్ధ రాములు, నాయకులు బాధే చంద్రం, ఆముద శ్రీనివాస్. మధుసూదన్ రెడ్డి, నరేందర్, అబ్బా సత్యం, సాగర్, కృష్ణమూర్తి, హరీష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు



# గణేష్ పండాల్ నిర్వాహకులతో పోలీసుల సమావేశం



**పటాన్ చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ పండాల్ నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. సుమారు వంద మంది పండాల్ నిర్వాహకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా నమోదు చేసే విధానాన్ని పోలీసులు వివరించారు. పండాళ్ల వద్ద భద్రతా చర్యలు, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అలాగే పండాళ్ల వద్ద డీజేలను వినియోగించరాదని నిర్వాహకులకు పోలీసులు స్పష్టంగా సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ప్రతి రక్తపు బొట్టూ విలువైనదే..

- **గీతంలో రక్తదాన శిబిరం.. 170 యూనిట్ల రక్తదానం**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**



'ప్రతి రక్తపు బొట్టూ విలువైనదే.. ప్రతి దాత మార్పు తీసుకురాగలరు. ఒక చుక్క.. ఒక ఆశ.. ఒక జీవితం' అనే నినాదంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సుమారు 170 యూనిట్ల రక్తాన్ని దానం చేయగా, అధ్యాపకులు, సిబ్బంది కూడా తమ వంతు సహకారం అందించారు. రక్తదాన ప్రక్రియను సురక్షితంగా, క్రమబద్ధమైన వాతావరణంలో నిర్వహించారు. రక్తదాతలకు పండ్లు, శీతల పానీయాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. స్వచ్ఛంద రక్తదానం ద్వారా అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించి ప్రాణాలను కాపాడవచ్చని గీతం యాజమాన్యం పేర్కొంది.



# ప్రతి రక్తపు బొట్టూ విలువైనదే..



**హత్నూర, సెప్టెంబర్ 08,(సిరి న్యూస్):**

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు, నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ సూచించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో భక్తులకు, ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. మంగళవారం జిన్నారం సి ఐ రమణా రెడ్డి,హత్నూర ఎస్ ఐ శ్రీదర్ రెడ్డి దౌల్తాబాద్ గ్రామం బి ఎన్ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించడంతో పాటు శాంతి, సామరస్యాలకు ప్రాధాన్యతనిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని వివరించారు.



# మహిళా ప్రజాప్రతినిధులను అవమానించడం దుర్మార్గం

- **మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్**
- **అసెంబ్లీ ఘటనకు నిరసనగా సూర్యాపేటలో బిఆర్ఎస్ నల్ల బ్యాడ్జీల ప్రదర్శన**
- **కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి: సూర్యాపేట ర్యాలీలో మాజీ ఎంపీ, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 సిరి న్యూస్:**



శాసనసభలో బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మరియు ఎమ్మెల్సీల పట్ల అధికార పక్షం వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మాజీ ఎంపీ, బిఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. ఈ ఘటనను నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో నల్ల దుస్తులు ధరించి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎంజీ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ... మహిళలను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని, బాధ్యులపై చర్యలు తీసుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వి. , జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జెడ్పీటీసీ జీడి బిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, బండారు రాజా, ప్రభాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్ మరియు పార్టీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతియుత నిరసనపై దాడి చేశారంటూ ఫిర్యాదు

- **కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బీఆర్ఎస్ నేతల వినతి**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**



శాంతియుతంగా నిరసన చేపడుతున్న తమ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకుల బృందం సీఐ రవీందర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడిని నిరసిస్తూ పటాన్‌చెరులో శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తుండగా కాంగ్రెస్ నాయకులు తమ కార్యకర్తలపై దాడి చేశారని ఆరోపించారు. పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయని తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాలకంటి యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 11ఏళ్లకు

## తల్లిదండ్రుల చెంతకు

- **చేరదీసి సంరక్షించిన మెదక్ జిల్లా బేతాని సంరక్షణ ఆశ్రమం.**

**మెదక్ సెప్టెంబర్,08(సిరి న్యూస్)**

తల్లిదండ్రుల మనోవేదన కు 11ఏళ్ళు పట్టింది. మతిస్థిమితం లేని బాలికను తల్లితండ్రుల ఆచూకీ తెలుసుకొని అప్పగించారు.మెదక్ జిల్లా సంక్షేమ శాఖ సామాజిక ప్రక్రియ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండా జిల్లా, మునుగోడు మండలానికి చెందిన దంపతులకు చెందిన మతి స్తిమితం లేని అమ్మాయి గత 11 సంవత్సరాల క్రితం ఇంటి నుండి తప్పిపోయి మెదక్ జిల్లా బేతాని సంరక్షణ ఆశ్రమంలో గత 11 సంవత్సరాలుగా ఆశ్రయం పొందుతుందని వివరించారు.అమ్మాయికి ఆధార కార్డు లేకపోవడం తో అమ్మాయికి ఆధార కార్డు చేపించే ప్రయత్నంలో చాలా సార్లు రిజెక్టు కావడం జరిగినదన్నారు. అమ్మాయిని మాదాపూర్ లోని ఆధార్ సెంటర్ లో నమోదు చేయగా ఆధార నెంబర్ రావడంతో దాని ఆధారంగా తల్లితండ్రుల ఆచూకి కనిపెట్టి వారిని పిలిపించి అమ్మాయిని తమ తల్లితండ్రులకు అప్పగించడం జరిగినదన్నారు.ఇట్టి విషయం పై తల్లి తండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, నాగరాజు, శ్రీనివాస్, సరిత మంజుల మరియు బేతాని ఆశ్రమ సోషల్ వర్కర్ వీరబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# ఘనంగా ప్రారంభమైన కబడ్డీ టోర్నమెంట్

- **- దేశవ్యాప్తంగా బీహెచ్ఈఎల్ యూనిట్ల నుంచి క్రీడాకారుల హాజరు**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ హాకీ గ్రౌండ్‌లో 'ఆల్ ఇండియా బీహెచ్ఈఎల్ ఇంటర్ యూనిట్ కబడ్డీ టోర్నమెంట్ -2026' మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. బీహెచ్ఈఎల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను హెచ్‌పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి కమ్యూనిటీ సెంటర్ అధ్యక్షుడు, ఆయిల్ రిగ్స్ అండ్ పల్వరైజర్స్ జీఎం టి. నందు, జీఎం (హెచ్ఆర్, టీఏ, సీఅండ్‌పీఆర్, మెడికల్) డాక్టర్ సంధ్యకర్ హాజరయ్యారు. కమ్యూనిటీ సెంటర్ ప్రతినిధులు, బీహెచ్ఈఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ బీహెచ్ఈఎల్ యూనిట్ల నుంచి వచ్చిన క్రీడాకారులు టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



# పోలీసు అరెస్టులతో బిఆర్ఎస్ పోరాటాలను ఆపలేరు



- **ఆడేపు మహేష్ నేత**
- **ఆత్మకూరు (ఎస్) బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ మహేష్ నేత హౌస్ అరెస్ట్.**
- **అరెస్టులతో పోరాటాలను ఆపలేరు: ఆడేపు మహేష్ నేత**
- **నిరసన హక్కును కాలరాయడమే ప్రజాస్వామ్యమా? – బిఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 సిరి న్యూస్:**

రాజ్యాంగబద్ధంగా నిరసనలు తెలుపుతుంటే పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ ఆత్మకూరు (ఎస్) మండల సోషల్ మీడియా ఇంచార్జ్ ఆడేపు మహేష్ నేత విమర్శించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మరియు మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా మంగళవారం ఆయనను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.

# సూర్యాపేట రైలు సాధన దీక్షలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గండూరి ప్రకాష్ మద్దతు






- **52వ రోజుకు చేరిన సూర్యాపేట రైలు సాధన దీక్షలు**
- **ప్రజల కల నెరవేరే వరకు పోరాడుతాం: రైలు సాధన దీక్షల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు : గండూరి ప్రకాష్**
- **రైల్వే లైన్ సాధించే వరకు పోరాటం ఆగదు: గండూరి ప్రకాష్**
- **సూర్యాపేటకు రైలు సాధించడమే లక్ష్యం – జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు**
- **సూర్యాపేట రైతు బజార్ వద్ద హోరెత్తిన రైలు సాధన నినాదాలు**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 సిరి న్యూస్:**

సూర్యాపేట పట్టణానికి రైలు సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా స్థానిక రైతు బజార్ వద్ద 'బుల్లెట్ రైలు మరియు రైలు సాధన కమిటీ' చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం తో 52వ రోజుకు చేరుకున్నాయి. జేపీసీ నాయకులు కుంట్ల ధర్మార్జున్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షల్లో భాగంగా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ నేతృత్వంలో నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈదీక్షా శిబిరానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్ హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సూర్యాపేట ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే లైన్ సాధన కోసం జరుగుతున్న
పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యలగందుల వెంకటేశ్వర్లు(వై.వి) బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉప్పల ఆనంద్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్ (మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్), భాషా మాజీ కౌన్సిలర్, జి.డి. బిక్షం మాజీ జెడ్పిటిసి, టైసన్ శ్రీను, వల్దాస్ జానీ, మోత్కూరు సందీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ప్రధాని పర్యటనలో
# తుపాకీ కలకలం

- పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

ముంబై, సెప్టెంబర్ 8 :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## తొలి బుల్లెట్ రైలు.. త్వరలోనే పట్టాలపైకి!

- సూరత్-బిలిమోరా సెక్షన్‌ను వచ్చే ఏడాది ప్రారంభించడమే లక్ష్యం
- డిసెంబరు 2026 నాటికి వాపీ-సూరత్ సివిల్ పనులు పూర్తి
- గంటకు 320 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్న రైలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:

భారతీయుల కలల ప్రాజెక్టుగా భావిస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలోనే పట్టాలెక్కనుంది. దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు ఊహించిన దానికంటే వేగంగా సాగుతున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వచ్చే ఏడాదిలోగా సూరత్‌బిలిమోరా మధ్య తొలి సెక్షన్‌ను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వాపీసూరత్ సెక్షన్ సివిల్ నిర్మాణ పనులను డిసెంబరు 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

**508 కిలోమీటర్ల కారిడార్**

ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ సుమారు 508 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. 2017 సెప్టెంబరులో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మహారాష్ట్ర, గుజరాత్, దాద్రానగర్ హవేలీ ప్రాంతాల మీదుగా సాగుతుంది. ప్రయాణికుల సౌకర్యం కోసం ముంబై, ఠాణే, విరార్, బోయిసర్, వాపీ, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి ప్రాంతాల్లో మొత్తం 12 స్టేషన్లను నిర్మిస్తున్నారు. స్థానిక సంస్కృతి, నగరాల ప్రత్యేకత ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణ శైలితో స్టేషన్లను తీర్చిదిద్దుతున్నారు.

**320 కిలోమీటర్ల వేగం**

బుల్లెట్ రైలు పట్టాల నిర్మాణంతోపాటు రైళ్ల తయారీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. పరీక్షల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తొలి కోచ్ ఇప్పటికే సిద్ధమైంది. గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే ఈ రైలుతో అహ్మదాబాద్‌ముంబై మధ్య ప్రయాణ సమయం 2 గంటల 58 నిమిషాలకు తగ్గనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అత్యున్నత భద్రతా ప్రమాణాలను అందించేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.

**ఆగస్టు 2027లో తొలి సర్వీస్**

తాజా అంచనాల ప్రకారం తొలి పూర్తిస్థాయి బుల్లెట్ రైలు సర్వీసును ఆగస్టు 2027లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొదటి దశలో సూరత్‌బిలిమోరా సెక్షన్‌ను వచ్చే ఏడాది ప్రారంభించనున్నారు. వాపీసూరత్ మధ్య సివిల్ నిర్మాణ పనులను డిసెంబరు 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్‌ను డిసెంబరు 2029 నాటికి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు ఆక్షేపణీయం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 :

అసెంబ్లీ అవరణలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అయిన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలతో పోలీసులు వ్యవహరించిన తీరు చాలా హేయమైనదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఒక ప్రకటనలో అన్నారు. మహిళా శాసన సభ్యులపై పోలీసులు అనుచితంగా ఎవరి ఆదేశాల ప్రకారం ప్రవర్తించారు.. సీఎంగానా, హోం మంత్రిగానా ఏ హోదాలో పోలీసులను ఆదేశించారు అంటూ ప్రశ్నించారు. పాలకులకు కొంచెమైనా సిగ్గు అనిపించడంలేదా అని అడిగారు. > స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు కోరాలని, చర్యలు తీసుకోవాలని సభలో చర్చించారని, దాంతోపాటు మహిళా శాసన సభ్యులపై వ్యవహరించిన తీరుపై చర్చ పెట్టాలి అని డిమాండ్ చేశారు. మహిళా శాసనసభ్యులను ఎందుకు అవమానించాల్సి వచ్చింది, మహిళా ఎమ్మెల్యేల మెడ, వెంట్రుకలు పట్టుకుని గుంజడం, చీర లాగడంపై నోరు విప్పకపోవడం కన్నా దారుణం ఏమైనా ఉంటుందా అని నిలదీశారు. ఆ పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు కొత్త దశ

- యూపీఐని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్న ప్రధాని నరేంద్ర మోడీ
- ఫిన్‌టెక్‌ను తదుపరి దశకు తీసుకెళ్లాలని సూచన
- రుణాలు, బీమా, పొదుపు రంగాల్లో టెక్నాలజీ వినియోగం పెంచాలని పిలుపు
- ఏజెంటిక్ ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని సూచన
- సైబర్ భద్రత, బలమైన నియంత్రణ వ్యవస్థ అవసరమన్న ప్రధాని




ముంబై, సెప్టెంబరు 8:

భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ తదుపరి దశకు సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2026లో మంగళవారం ప్రసంగించిన ఆయన.. గత దశాబ్ద కాలంలో దేశ ఫిన్‌టెక్ ప్రయాణం ఎంతో ప్రత్యేకంగా సాగిందని పేర్కొన్నారు. డిజిటల్ పరివర్తనలో యూపీఐ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. దేశం ఇప్పటికే అవసరమైన స్థాయి, విస్తృతి, ప్రజలందరికీ అందుబాటు సాధించిందని.. ఇప్పుడు ఫిన్‌టెక్ వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు.

**యూపీఐ విస్తరణపై మోడీ దృష్టి**

యూపీఐ భారత అభివృద్ధి కథనంతో విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గత పదేళ్లలో ఫిన్‌టెక్ రంగం విస్తరించడంతో అధికారిక ఆర్థిక వ్యవస్థకు దూరంగా ఉన్న కోట్లాది మంది ప్రజలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారని చెప్పారు. యూపీఐతో ప్రజలు ఆర్థిక సేవలను వినియోగించే విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. భారత్ యూపీఐ ప్రస్తుతం 11 దేశాల్లో అందుబాటులో ఉందని.. ఇక ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానం చేయడమే తదుపరి లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

**ఫిన్‌టెక్ విస్తరణకు మోడీ పిలుపు**

ఫిన్‌టెక్ రంగం కేవలం డిజిటల్ చెల్లింపులకే పరిమితం కాకూడదని ప్రధాని నరేంద్ర మోడీ సూచించారు. రుణాలు, పొదుపులు, పెన్షన్లు, బీమా వంటి రంగాల్లో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని అన్నారు. వీధి వ్యాపారులను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పీఎం స్వనిధి క్రెడిట్ కార్డు పథకాన్ని 2030 వరకు కొనసాగించాలని నిర్ణయించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. సాంకేతికత ద్వారా వినియోగదారుల ఆర్థిక అవసరాలను అర్థం చేసుకుని, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన ఆర్థిక ఉత్పత్తులను రూపొందించవచ్చన్నారు.

**కొత్త సాంకేతికతలపై మోడీ సూచన**

క్వాంటమ్ కంప్యూటింగ్, ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలు ఆర్థిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జీఎఫ్ఎఫ్ 2026లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీలపై ప్రధానంగా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఈ సాంకేతికతలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు.

**సైబర్ భద్రతకు మోడీ ప్రాధాన్యం**

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఫిన్‌టెక్ రంగానికి బలమైన నియంత్రణ వ్యవస్థ కూడా అవసరమన్నారు. తదుపరి దశలో ఆవిష్కరణలకు సాంకేతిక సామర్థ్యాలతో పాటు ప్రజల విశ్వాసం, భద్రత, సమర్థవంతమైన నియంత్రణ కీలకమని పేర్కొన్నారు.

## అపర్ణ కురుప్‌పై పోలీసు కేసు

- మతపరమైన భావాలు దెబ్బతీశారంటూ కేసు నమోదు
- టీవీ డిబేట్‌లో వ్యాఖ్యలే కారణం
- సోషల్ మీడియాలో బెదిరింపులపై మరో కేసు
- ఛానెల్ నుంచి కార్యక్రమం తొలగింపు
- మతపెద్ద వ్యాఖ్యలపై కొనసాగుతున్న వివాదం



కొచ్చి, సెప్టెంబరు 8:

కేరళకు చెందిన ముస్లిం మతపెద్ద మహిళలను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నిర్వహించిన టీవీ చర్చ ఇప్పుడు పోలీసు కేసుకు దారితీసింది. ఈ చర్చలో పాల్గొన్న మలయాళ టీవీ జర్నలిస్ట్, యాంకర్ అపర్ణ కురుప్‌పై కొచ్చి సిటీ సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాసర్‌గోడ్‌కు చెందిన అబ్దుల్ హకీమ్ బీఎం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సెప్టెంబరు 7న కేసు నమోదైంది.

**మతపరమైన భావాలు దెబ్బతీశారంటూ..**

టీవీ డిబేట్ సందర్భంగా అపర్ణ కురుప్ చేసిన వ్యాఖ్యలు మతపరమైన భావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అల్లర్లను ప్రేరేపించడం, మతపరమైన భావాలను దెబ్బ తీయడం, వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివాదం నేపథ్యంలో సదరు టీవీ ఛానెల్ ఆ కార్యక్రమాన్ని తొలగించింది. అపర్ణ కురుప్‌తో పాటు ఛానెల్ యాజమాన్యం తమ వ్యాఖ్యలపై ఇప్పటికే విచారం వ్యక్తం చేశాయి.

**బెదిరింపులపైనా కేసు**

ఇదిలా ఉండగా, అపర్ణ కురుప్‌పై సోషల్ మీడియాలో పరువు నష్టం కలిగించే పోస్టులు, బెదిరింపులు వస్తున్నాయంటూ ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై విజ్డమ్ స్టూడెంట్స్ సంస్థకు చెందిన అబ్దుల్లా బాసిల్ సి.పి.తో పాటు మరో గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదైంది.

**మతపెద్ద వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

ఇటీవల సున్నీ మత పండితుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలు కేరళలో వివాదానికి దారితీశాయి. మతపరమైన వేడుకల సమయంలో ముస్లిం మహిళలు తమకు సంబంధం లేని పురుషులతో కలిసి బహిరంగ ప్రదేశాల్లో ఉండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కేరళలో రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. కేరళ సీఎం వీడీ సతీషన్ స్పందిస్తూ.. మతపండితుడి వ్యాఖ్యలు 21వ శతాబ్దపు ప్రగతిశీల ఆలోచనలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

## కొత్త ప్రపంచ పటంలో అరుణాచల్ ప్రదేశ్.. అక్సాయ్ చిన్!

- భారత్ సరిహద్దుల వెలుపల ఉన్నట్లు ఐరాస మ్యాప్‌లో చిత్రీకరణ
- అరుణాచల్-నాగాలాండ్ సరిహద్దు తొలగింపుపై వివాదం
- అక్సాయ్ చిన్‌ను ప్రత్యేక ప్రాంతంగా చూపించిన ఐరాస
- 'కరెక్ట్ ద మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు.. మ్యాప్‌ను మాత్రం అంగీకరించలేదు
- సార్వభౌమత్వంపై రాజీపడేది లేదన్న భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:

ఐక్యరాజ్యసమితి రూపొందించిన కొత్త ప్రపంచ పటంలో అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్ సరిహద్దుల వెలుపల ఉన్నట్లు చూపించడం వివాదానికి దారితీసింది. భారత్‌చైనా మధ్య సరిహద్దు వివాదంలో ఉన్న ఈ రెండు ప్రాంతాలను వేర్వేరు ప్రాంతాలుగా చిత్రీకరించడం అభ్యంతరాలకు కారణమైంది. ఇటీవల ఐరాస జనరల్ అసెంబ్లీ ఆమోదించిన 'కరెక్ట్ ద మ్యాప్' తీర్మానం తర్వాత ఈ కొత్త మ్యాప్ వెలువడింది.

**అరుణాచల్ సరిహద్దులపై మార్పులు**

కొత్త మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించినట్లు కనిపిస్తోంది. అరుణాచల్‌ను అస్సాం, చైనాలతో సరిహద్దులు కలిగిన ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. అక్సాయ్ చిన్‌ను పశ్చిమ వైపు భారతదేశంతో, తూర్పు వైపు చైనాతో సరిహద్దు కలిగిన ప్రత్యేక ప్రాంతంగా చిత్రీకరించారు. ఈ మార్పులకు గల కారణాలను ఐరాస ఇప్పటివరకు వివరించలేదు.

**జమ్మూ కాశ్మీర్‌పై వేరుగా**

జమ్మూ కాశ్మీర్ విషయంలో మాత్రం నియంత్రణ రేఖను (ఎల్ఓసీ) చుక్కల రేఖతో ఐరాస మ్యాప్‌లో చూపించింది. భారత్, పాకిస్థాన్ మధ్య జమ్మూ కాశ్మీర్ తుది స్థితిపై ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదనే అంశాన్ని ఐరాస పేర్కొంది.

**తీర్మానానికి భారత్ మద్దతు**

వాస్తవ విస్తీర్ణాలను ప్రతిబింబించేలా కొత్త ప్రపంచ పటానికి సంబంధించిన తీర్మానాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 4న ఆమోదించింది. దీనికి 164 దేశాలు అనుకూలంగా ఓటేయగా.. అమెరికా వ్యతిరేకంగా ఓటు వేసింది. భారత్ కూడా తీర్మానానికి మద్దతు తెలిపింది. అయితే నిర్దిష్ట మ్యాప్, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా జాతీయ సరిహద్దుల చిత్రీకరణను ఆమోదించడం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సమాన విస్తీర్ణ ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించే సూత్రానికే భారత్ మద్దతు తెలిపిందని పేర్కొంది.

**సరిహద్దులపై రాజీ లేదన్న భారత్**

జమ్మూ కాశ్మీర్, లడాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాలను అధికారిక భారత మ్యాప్ ప్రకారమే చూపించాలని భారత్ స్పష్టం చేసింది. తప్పుదారి పట్టించేలా ఉన్న ఏ మ్యాప్‌నూ అంగీకరించబోమని పేర్కొంది. దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో తమ వైఖరి స్పష్టంగా ఉందని, ఇందులో ఎలాంటి రాజీ ఉండదని తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడాఖ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్ తన భూభాగాలుగా పేర్కొంటోంది.

# టీచర్ నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- అర్హతలు లేనివారిని ఉపాధ్యాయులుగా నియమించొద్దు
- ఉద్యోగంలో కొనసాగించడంపైనా మధ్యంతర ఆంక్షలు
- ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనలు తప్పనిసరని స్పష్టం
- టీచర్లు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రొవిన్షియలైజేషన్‌పై పిల్
- ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ఎస్‌సీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:

ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగంలో కొనసాగింపుపై సుప్రీంకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించకూడదని, అలాంటి వారిని ఉద్యోగాల్లో కొనసాగించకూడదని స్పష్టం చేసింది.

**అర్హతలు తప్పనిసరన్న సుప్రీంకోర్టు**

సంబంధిత చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు ఉపాధ్యాయులకు తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల కింద నిర్దేశించిన అర్హతలు లేని వ్యక్తులను పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించకూడదని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న ఉపాధ్యాయుల విషయంలోనూ సంబంధిత చట్టాలు, నిబంధనల్లోని అర్హతలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

**టీచర్ నియామకాలపై పిల్**

విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులను ప్రొవిన్షియలైజేషన్ చేసే ప్రక్రియకు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ ఈ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై తమ స్పందనను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణలో కేసుకు సంబంధించిన ఇతర అంశాలను పరిశీలించనుంది.

**ఏ చట్టం ఏం చెబుతుంది?**

ఆర్‌టీఈ చట్టం ప్రాథమిక విద్యకు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలను నిర్దేశిస్తుంది. ఎన్‌సీటీఈ పాఠశాల ఉపాధ్యాయులకు అవసరమైన అర్హతలు, ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన నిబంధనలను పర్యవేక్షిస్తుంది. యూజీసీ ఉన్నత విద్యా సంస్థల్లో బోధించే అధ్యాపకులకు వర్తించే అర్హతలు, ప్రమాణాలను నిర్దేశిస్తుంది.

**తుది తీర్పు వరకు మధ్యంతర ఆదేశాలు**

ప్రస్తుతం సుప్రీంకోర్టు జారీ చేసినవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే. పిల్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఇవి అమల్లో ఉంటాయి. తదుపరి విచారణల్లో ఈ ఆదేశాల పరిధి, ప్రభావం, ఏయే ఉపాధ్యాయులు, విద్యా సంస్థలకు ఇవి వర్తిస్తాయనే అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
బుధవారం
సెప్టెంబర్-9-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 242
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4



2

## వారానికి ఒక వార్డు సమస్యలపై సర్పంచ్ క్షేత్రస్థాయి పర్యటన

- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు.
- ఆర్.వెంకటాపూర్ సర్పంచ్ వెంకు గారి ఉమా రాణి సంజీవరెడ్డి

## విధి నిర్వహణలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి

- తూప్రాన్‌లో ఛాతినొప్పితో కుప్పకూలిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్
- మేడ్చల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- బుధవారం మల్కాపూర్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



2




# ఎవరి లెక్కలు వారివే!

## మెదక్‌లో ముక్కోణపు సమరం

- గతంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ద్విముఖ పోరు
- ఇప్పుడు కమలం ఎదుగుదలతో మారిన ముఖచిత్రం
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు అధికార కాంగ్రెస్ కసరత్తు
- స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు గులాబీ పార్టీ వ్యూహాలు
- గ్రామస్థాయి కేడర్‌ను సమాయత్తం చేసే పనిలో నేతలు
- బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై అంతర్గత చర్చలు..
- మాజీ ఎమ్మెల్యే పద్మకే మళ్లీ అవకాశమా లేక కొత్త ముఖమా?
- పార్టీల బలం కంటే అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్ కే పీఠం
- మెదక్ గడ్డపై ఇప్పుడే ఎన్నికల హీట్

4

మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాబోయే సార్వత్రిక సమరానికి సంబంధించి ఇప్పటి నుంచే తీవ్ర రాజకీయ చర్చలు మొదలయ్యాయి. నిన్నటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే ముఖాముఖి పోరు సాగుతుందన్న అంచనాలు ఉండగా, తాజాగా బీజేపీ కూడా క్షేత్రస్థాయిలో బలాన్ని పుంజుకుంటూ ప్రధాన శక్తిగా ఎదుగుతుండటంతో నియోజకవర్గ రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మెదక్ రాజకీయం హోరాహోరీ ముక్కోణపు సమరంగా మారబోతోందన్న అంశంపై పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా చర్చ సాగుతోంది. మూడు పార్టీల అగ్రనేతలు ఇప్పటికే మండలాల వారీగా తమ ఓటు బ్యాంకు లెక్కలను సరిచూసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

- (ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్)





# ధర్నాలతో దద్దరిల్లిన పటాన్‌చెరు!

- కాంగ్రెస్.. బీఆర్ఎస్.. విద్యార్థుల పోటాపోటీ ఆందోళనలు
- జాతీయ రహదారిపై బైఠాయింపు..
- మూడున్నర గంటలపాటు ఉద్రిక్తత
- భారీ ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు

3



పటాన్‌చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్): కాంగ్రెస్.. బీఆర్ఎస్.. మధ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు.. ఇలా మూడు వర్గాల ఆందోళనలతో పటాన్‌చెరు జాతీయ రహదారి మంగళవారం దద్దరిల్లింది. ఒకే సమయంలో ధర్నాలు, ర్యాలీలు, నినాదాలు కొనసాగడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు జాతీయ రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు స్తంభించి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు మూడున్నర గంటలపాటు పరిస్థితి ఉద్రిక్తంగా కొనసాగింది. ఓవైపు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు.





# వారానికి ఒక వార్డు సమస్యలపై సర్పంచ్ క్షేత్రస్థాయి పర్యటన



- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు.
- ఆర్.వెంకటాపూర్ సర్పంచ్ వెంకు గారి ఉమా రాణి సంజీవరెడ్డి

రామాయంపేట, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్) రామాయంపేట మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ప్రతి వార్డును వారానికి ఒకసారి సందర్శించి, స్థానికంగా నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేలా పర్యటన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇందులో భాగంగా మంగళవారం మూడో వార్డులో సర్పంచ్ ఉమా సంజీవ రెడ్డి పర్యటించారు. వార్డులోని వివిధ ప్రాంతాలను పరిశీలించి, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, మురుగు కాల్వలు, రోడ్లు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై, మురికి కాల్వల్లో చెత్త వేయకుండా.. ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనంలోనే చెత్తను వేయాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రతి వారం ఒక్కో వార్డును సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహాయ సహకారాలతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తామని ప్రకటించారు.



# విధి నిర్వహణలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి

- తూప్రాన్‌లో ఛాతినొప్పితో కుప్పకూలిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్
- మేడ్చల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- బుధవారం మల్కాపూర్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

తూప్రాన్ సెప్టెంబర్ 08 సిరి న్యూస్ విధి నిర్వహణకు తూప్రాన్ వచ్చిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆనందం 54 ఆకస్మికంగా మృతి చెందారు. మెదక్ జిల్లాలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో క్యూఆర్టీలో విధులు నిర్వహిస్తున్న ఆనందం మంగళవారం చెక్‌పోస్ట్ విధుల నిమిత్తం తూప్రాన్‌కు వచ్చారు. ఇక్కడికి రాగానే ఛాతినొప్పి రావడంతో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో వైద్యులు ఈసీజీ నిర్వహిస్తున్న సమయంలో ఆనందం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు వెంటనే అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు అక్కడ వైద్యులు పరీక్షించి ఆనందం మృతి చెందినట్లు ధ్రువీకరించారు అందరితో కలిసిమెలిసి సరదాగా ఉండే ఆనందం ఇక లేరని తెలిసి కన్నీటిపర్యంతమైన సహచరులు ఆనందం అందరితో కలిసిమెలిసి సరదాగా ఉంటూ సహచరులతో ఆత్మీయంగా ఉండేవాడని తోటి సిబ్బంది తెలిపారు విధుల్లో చురుగ్గా ఉండటంతో పాటు సహచరులకు అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు ఆనందం ఇక లేరనే వార్త తెలియడంతో సహచరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీటిపర్యంతమయ్యారు హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతిపట్ల జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు పోలీసు శాఖకు ఆనందం అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆనందం అంత్యక్రియలు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామంలో అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై ఆనందానికి తుది వీడ్కోలు పలకనున్నారు.



# ధర్నాలతో దద్దరిల్లిన పటాన్‌చెరు!

పటాన్‌చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్): కాంగ్రెస్.. బీఆర్ఎస్.. మధ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు.. ఇలా మూడు వర్గాల ఆందోళనలతో పటాన్‌చెరు జాతీయ రహదారి మంగళవారం దద్దరిల్లింది. ఒకే సమయంలో ధర్నాలు, ర్యాలీలు, నినాదాలు కొనసాగడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు జాతీయ రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు స్తంభించి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు మూడున్నర గంటలపాటు పరిస్థితి ఉద్రిక్తంగా కొనసాగింది. ఓవైపు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ మహిళా శ్రేణులు భారీ ఆందోళనకు దిగాయి. భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇదే సమయంలో పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మూడు వర్గాల ఆందోళనలు ఒకేసారి కొనసాగడంతో పటాన్‌చెరులో ఉద్రిక్తత మరింత పెరిగింది. పోలీసులు పలుమార్లు ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు ఆందోళనలతో పటాన్‌చెరు ప్రధాన రహదారులు నినాదాలతో మార్మోగాయి.



## స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకోం!

- -బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కాంగ్రెస్ ఫైర్..
- -సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్
- -రాజ్యాంగ పదవిని కించపరిచేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే అవమానం: కాట సుధా



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్యానికే అవమానమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ రేంజ్ డీసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐ రవీందర్‌కు వినతిపత్రం అందజేసి.. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాట సుధా మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవిని కించపరిచేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే అవమానం అని, దళితుల పట్ల బీఆర్ఎస్ వైఖరి మొదటి నుంచీ అణచివేత ధోరణిలోనే ఉందని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని, దీనిపై మాజీ సీఎం కేసీఆర్ స్పందించకపోవడం మరింత బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత నేతలకు జరిగిన అవమానాలను కూడా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, స్టేట్ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో కదం తొక్కిన గులాబీ మహిళా దండు

- మహిళా ఎమ్మెల్యేలపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ మహిళా శ్రేణుల ఆందోళన
- -కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం.. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- -హామీలు అడిగితే అరెస్టులు, దాడులా?.. సింధు,యాదమ్మ



పటాన్‌చెరు, సెప్టెంబర్ 8 (సిరి న్యూస్):
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ పటాన్‌చెరులో బీఆర్ఎస్ మహిళా శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి, ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు తరలివచ్చారు. గులాబీ జెండాలు, నినాదాలతో పటాన్‌చెరు ప్రధాన ప్రాంతం హోరెత్తింది. ఈ సందర్భంగా సింధు, యాదమ్మ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపైనే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సింధు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళా ప్రజాప్రతినిధుల గొంతును అణచివేయాలని చూడటం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని భయపెట్టడం సాధ్యం కాదని, మహిళా శ్రేణులు ఐక్యంగా పోరాడుతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. యాదమ్మ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అరెస్టులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆడబిడ్డలకు పోరాటాలు, అరెస్టులు కొత్తేమీ కాదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళల ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని యాదమ్మ, సింధు ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు.










# ఎవరి లెక్కలు వారివే!

- గతంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ద్విముఖ పోరు
- ఇప్పుడు కమలం ఎదుగుదలతో మారిన ముఖచిత్రం
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు అధికార కాంగ్రెస్ కసరత్తు
- స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు గులాబీ పార్టీ వ్యూహాలు
- గ్రామస్థాయి కేడర్‌ను సమాయత్తం చేసే పనిలో నేతలు
- బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై అంతర్గత చర్చలు..
- మాజీ ఎమ్మెల్యే పద్మకే మళ్లీ అవకాశమా లేక కొత్త ముఖమా?
- పార్టీల బలం కంటే అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్ కే పీఠం
- మెదక్ గడ్డపై ఇప్పుడే ఎన్నికల హీట్

## మెదక్‌లో ముక్కోణపు సమరం

**(ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్): మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాబోయే సార్వత్రిక సమరానికి సంబంధించి ఇప్పటి నుంచే తీవ్ర రాజకీయ చర్చలు మొదలయ్యాయి. నిన్నటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే ముఖాముఖి పోరు సాగుతుందన్న అంచనాలు ఉండగా, తాజాగా బీజేపీ కూడా క్షేత్రస్థాయిలో బలాన్ని పుంజుకుంటూ ప్రధాన శక్తిగా ఎదుగుతుండటంతో నియోజకవర్గ రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మెదక్ రాజకీయం హోరాహోరీ ముక్కోణపు సమరంగా మారబోతోందన్న అంశంపై పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా చర్చ సాగుతోంది. మూడు పార్టీల అగ్రనేతలు ఇప్పటికే మండలాలవారీగా తమ ఓటు బ్యాంకు లెక్కలను సరిచూసుకునే పనిలో నిమగ్నమయ్యారు.**

### పెరిగిన అంచనాలు..

2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ 87,126 ఓట్లు సాధించి ఘన విజయం సాధించగా, బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి 76,969 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ 13,657 ఓట్లు మాత్రమే దక్కించుకోగలిగారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో అసెంబ్లీ పరిధిలోనూ కమలం పార్టీ గ్రాఫ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో గతంలో మూడో స్థానానికే పరిమితమైన బీజేపీ, ఇప్పుడు ప్రధాన పోటీదారుగా అవతరించడంతో వచ్చే ఎన్నికల లెక్కలు మరింత జటిలంగా మారాయి.

### సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ తంటాలు..

అధికారంలో ఉండటం, సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రాతినిధ్యం వహిస్తుండటం కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చే ప్రధానాంశాలు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, అభివృద్ధి నిధుల కేటాయింపు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం ద్వారా తన పట్టును నిలుపుకోవాలని ఎమ్మెల్యే రోహిత్ ప్రయత్నిస్తున్నారు. అయితే అధికారంలో ఉండటం ఎంతటి బలమో, ప్రజల నుంచి అంతే స్థాయిలో వచ్చే ఆకాంక్షలు, అంచనాలు ప్రభుత్వానికి సవాలుగా మారాయి. రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం అమలు, సాగునీరు, తాగునీటి సరఫరా, గ్రామీణ రోడ్ల పరిస్థితి మరియు స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి పరీక్షగా మారే అవకాశం ఉంది.

### పద్మాదేవేందర్‌రెడ్డికే మళ్లీ ఛాన్సా?

దశాబ్దానికి పైగా అధికారంలో ఉండి నియోజకవర్గాన్ని ఏలిన బీఆర్ఎస్ పార్టీ మెదక్‌లో తిరిగి తన పూర్వ వైభవాన్ని సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బలమైన కేడర్ నెట్‌వర్క్, గత పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులే ఆ పార్టీకి అసలైన బలం. 2023లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ పార్టీ పట్టు తప్పలేదని భావిస్తున్న శ్రేణులు, ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనలతో ప్రజల్లోకి వెళ్తున్నాయి. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలతో ఉన్న సుదీర్ఘ అనుబంధం ఆమెకు సానుకూలాంశం. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పాత నాయకత్వానికే అవకాశం ఇస్తారా లేక కొత్త తరం నాయకుడిని బరిలోకి దింపుతారా అన్నదానిపై బీఆర్ఎస్ అధిష్టానంలో తీవ్ర సమాలోచనలు సాగుతున్నాయి.

### దూకుడు పెంచిన బీజేపీ..

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో మెదక్ బీజేపీ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. ఎంపీ స్థానాన్ని గెలుచుకున్న ఊపును అసెంబ్లీ స్థానాల్లోనూ కొనసాగించేందుకు పార్టీ నాయకత్వం గ్రామస్థాయిలో సంస్థాగత పునాదులను పటిష్టం చేసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీలకు సరైన ప్రత్యామ్నాయంగా నిలవడం ద్వారా యువత, తటస్థ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కాకుండా, నియోజకవర్గ వ్యాప్తంగా నిరంతరం ప్రజా పోరాటాలు సాగిస్తూ ప్రధాన పోటీదారుగా ఎదగడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోంది. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామీణ ఓటర్ల తీర్పే అంతిమ ఫలితాన్ని శాసించనుంది. పట్టణ ఓట్లతో పాటు పాపన్నపేట, రామాయంపేట, నార్సింగి, శంకరంపేట, నిజాంపేట, హవేలీఘన్‌పూర్ మండలాల్లోని గ్రామీణ ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారన్నది ఆసక్తికరంగా మారింది. మూడు బలమైన పార్టీలు రంగంలో ఉన్నప్పుడు ఓట్లు ఎలా చీలుతాయి, బీజేపీ చీల్చే ఓట్లు కాంగ్రెస్‌ను దెబ్బతీస్తాయా లేక బీఆర్ఎస్ అవకాశాలకు గండికొడతాయా అన్నదే ఎన్నికల భవితవ్యాన్ని తేల్చనుంది. స్థానిక నాయకుల పార్టీ మార్పులు, అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్, చివరి నిమిషంలో జరిగే రాజకీయ సమీకరణాలే మెదక్ పీఠాన్ని అధిష్టించే నాయకుడెవరో నిర్ణయించనున్నాయి.

